ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 18 ఫిబ్రవరి 2025

ప్రజాసమస్యలపై దృష్టి పెట్టండి : కలెక్టర్


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించడంతో పాటు వాటిని పెండింగ్‌లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేట, మదనపల్లె డివిజన్‌లో ఉన్న తహశీల్దార్లు అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో భూ సమస్యలు తలెత్తడానికి కారణాలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా తహశీల్దార్లు బాధ్యత తీసుకోవాలని చెప్పారు.

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు..

- వీరబల్లి మండలానికి చెందిన పాపులమ్మ తన భర్త 2023లో చనిపోయాడని, తనకు వితంతు పింఛన్ అందడం లేదని, వితంతు పింఛన్ ఇప్పించాల్సిందిగా కలెక్టర్‌కు విన్నవించుకుంది.
- రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ గ్రామస్తులు తమ పల్లెలో అమ్మవారి గుడి నిర్మాణానికి, పెళ్లి మండపానికి కొంత స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.
- వీరబల్లి మండలం మాదిగపల్లె వీరయ్యగారిపల్లెకు చెందిన లక్ష్మీదేవి తన భర్తకు పెరాలసిస్ వచ్చి రెండు కాళ్లు, రెండు చేతులు చచ్చుబడిపోయాయని, ఆయనకు 6 వేల రూపాయలు పింఛన్ వస్తోందని, దీనిని 15 వేల రూపాయలకు పెంచాలని కోరింది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదనరావు, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి వద్దకు జేసీ

పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన దివ్యాంగుడిని చూసి జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ స్వయంగా అతడి దగ్గరికి వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. రైల్వేకోడూరు మండలంలోని కమ్మపల్లిలో సర్వే నెంబర్ 136లో 0.62 సెంట్లు భూమి కలదు. ఈ భూమిని ఆన్‌లైన్ చేయించుకునేందుకు నేను గత ఏడాది నుంచి కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. నా భూమి ఆన్‌లైన్ ఎక్కించడం లేదు. ఈ భూమి చుక్కల భూమి అంటున్నారు. కాబట్టి ఈ విషయం కాస్త చూడండి సార్ అని కోరాడు. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్‌తో ఆయన మాట్లాడి 20 రోజుల్లో నీ పని పూర్తి చేస్తానని జేసీ హామీ ఇచ్చాడని అర్జీదారుడు కోటేశ్వరరావు తెలిపాడు.

రోడ్డున్నా.. బస్సు లేదన్నా..

- రూ.5 కోట్లు ఖర్చు.. బస్సు నడవక తుస్సు..
- 15 ఏళ్ల కిందటే రోడ్డు నిర్మాణం
- ఆ రోడ్డులో కనీసం ఒక బస్సు కూడా నడవని వైనం
- 30 కిలోమీటర్లు దూరం తగ్గి 15 నిమిషాల్లో వెళ్లే చక్కటి మార్గం
- పుల్లంపేట-చిట్వేలి ఘాట్ రోడ్డును పట్టించుకోని ప్రజాప్రతినిధులు


చిట్వేలి-పుల్లంపేట రోడ్డులో వాహనాలు నడపకపోవడంతో సైకిళ్ల మీద విద్యార్థుల చక్కర్లు

రాజంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి-పుల్లంపేట మండలాలకు అత్యంత సులువుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన ఘాట్ రోడ్డు నేటికీ నిరుపయోగంగా ఉంది. సుమారు 15 ఏళ్ల కిందట అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, అప్పటి స్థానిక ఎమ్మెల్యే గుంటి వెంకటేశ్వరప్రసాద్ కృషితో సుమారు రూ.5 కోట్ల ఖర్చుతో ఘాట్‌రోడ్డును నిర్మించారు. గతంలో చిట్వేలి వాసులు పుల్లంపేటకు రావాలన్నా, పుల్లంపేట వాసులు చిట్వేలికి వెళ్లాలన్నా సుమారు 45 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. పుల్లంపేట నుంచి వయా రాజంపేటకు వచ్చి చిట్వేలికి వెళ్లేవారు. అదేవిధంగా చిట్వేలి వారు రాజంపేటకు వచ్చి పుల్లంపేటకు వచ్చేవారు.

అదే పల్లెల నుంచి వచ్చేవారు పుల్లంపేటకు వచ్చి ఆ తర్వాత రాజంపేటకు వెళ్లి చిట్వేలికి పోయేవారు. చిట్వేలివాసులు అంతే. అంటే మూడు వాహనాలు మారాల్సి వచ్చేది. సమయానికి వాహనాలు దొరక్కపోతే చాలా ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని గమనించి అప్పటి ఎమ్మెల్యే గుంటి వెంకటేశ్వరప్రసాద్ పుల్లంపేట-చిట్వేలి మధ్య అతి తక్కువ దూరంలో సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేసి రోడ్డును వేయించారు. వెంటనే అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డితో ఈ రోడ్డును ప్రారంభింపజేశారు. కొద్దిరోజులు నెల్లూరుకు ఈ మార్గంలో బస్సులు కూడా నడిపారు. ఇంతలో చిట్వేలి వైపు ఉన్న ఓ లోయ వద్ద వర్షాకాలంలో రోడ్డు కుచించుకుపోయింది. అక్కడ మలుపు వద్ద పూర్తిగా రోడ్డు పాడైపోయింది. కల్వర్టు కూడా లేకుండా పోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. మూడేళ్ల పాటు మరమ్మతులు చేయకపోవడంతో తిరిగి ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో తిరిగి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. రూ.50 లక్షల ఖర్చుతో దెబ్బతిన్న మలుపు వద్ద తిరిగి రక్షణవాల్‌ను ఏర్పాటు చేసి రోడ్డుకు మరమ్మతులు చేశారు. అయితే కొద్దిరోజుల పాటు నడిపిన ఆర్టీసీ బస్సును ఆపివేసి తిరిగి పునరుద్ధరించలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు నేటికీ ఈ మార్గంలో ఆర్టీసీ వారు బస్సులు నడపడం లేదు.

కేవలం 12 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రెండు మండలాల వద్ద ఈ ఘాట్‌రోడ్డును పుల్లంపేట వారు చిట్వేలికి రావాలన్నా, చిట్వేలివారు పుల్లంపేటకు వెళ్లాలన్నా పట్టుమని 15 నిమిషాలు కూడా పట్టదు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో చిట్టడవి అందాలను తిలకిస్తూ గమ్యస్థానానికి చేరుకోవచ్చు. మూడు వాహనాలు మారాల్సిన పనిలేదు. 45 కిలోమీటర్ల చుట్టూ తిరిగి సమయం అంతా వృథా చేసుకోవాల్సిన పనిలేదు. అదే ఈ రెండు మండలాల మధ్య బస్సు తిరిగి అటు ఇటు తిరిగి ఏకంగా వంద గ్రామాలకు ప్రయాణ సౌకర్యం సులభతరమవుతుంది. ఈ మార్గంలో 15 ఏళ్ల కిందట ఎంతో చూడచక్కని తారు రోడ్డు ఏర్పాటు చేసి ప్రారంభిస్తే ఇటు ప్రజా ప్రతినిధులు గాని, అటు ఆర్టీసీ అధికారులు గాని ఈ ప్రాంతంలో బస్సు నడపాలన్న ఆలోచన చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. బస్సులు పోనందున ఇప్పుడు మోటారు సైకిళ్లు, ఆటోలు, కార్లు, టెంపోలు, లారీలు వెళుతున్నాయి. ఉదయం,


చిట్వేలి-పుల్లంపేట మధ్య నిర్మించిన రోడ్డు

సాయంత్రం వేళ వాహనాలు తిరిగినా మిగిలిన సమయంలో ఈ రోడ్డు వెలవెలబోతోంది. గత జగన్ హయాంలో అన్ని రోడ్లు దెబ్బతిన్నా ఈ రోడ్డు మాత్రం దెబ్బతినలేదు. వాహనాల రద్దీ లేకపోవడంతో ఈ రోడ్డు చెక్కుచెదరకుండా ఉంది. ఈ చిట్టడవి ఘాట్ రోడ్డు మార్గం చిన్నారులు సైకిల్ నేర్చుకోవడానికి, వారు ఆనందంగా ఆడుకోవడానికి, ఓ విహార విడిదికి ఉపయోగపడుతోంది. రాజంపేట, పుల్లంపేట, చిట్వేలి మార్గం ప్రాంతాల్లోని వారు సండే స్పెషల్‌గా, తీరిక వేళల్లో ఈ మార్గంలోని చిట్టడవి చెట్లలో కూర్చుని ఆనందంగా విందు భోజనాలు స్వీకరించి విహారం చేస్తుంటారు. ఇక మందుబాబులకైతే ఇక్కడ అడ్డే లేకుండాపోతోంది. అన్నిసౌకర్యాలు ఉండి ప్రయాణానికి ఎంతో సులువైన మార్గంలో బస్సులు నడపకపోవడం విచారకరం. రాజంపేట వాసులు బెస్తపల్లె మార్గం గుండా కాకుండా ఈ ఘాట్‌రోడ్డు మార్గంలో అటు చిట్వేలి, రాపూరుకు, నెల్లూరు, వెంకటగిరి, గూడూరుకు ఎంచక్కా అమరావతికి కూడా వెళ్లవచ్చు. అటువంటి ఈ చక్కటి మార్గాన్ని వినియోగించుకోకపోవడం నేటి పాలకుల, అధికారుల తీరుపై విమర్శలకు గురి చేస్తోంది. ఇకనైనా ఈ ప్రాంతీయుల మనోభావాలను, వారి ప్రయాణ ఇబ్బందులను గుర్తించి ఈ రెండు మండలాల మధ్య ఘాట్‌రోడ్డు మార్గంలో ఆర్టీసీ బస్సులు నడపాలని, అదేవిధంగా నెల్లూరు, గూడూరు, రాపూరు ప్రాంతాల మీదుగా రాజంపేటకు ఈ మార్గంలో బస్సులు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోట్లు ఖర్చు చేసినా ప్రయోజనం లేదు..



కోట్లు ఖర్చు చేసినా ప్రయోజనం లేకండాపోయింది. తామందరం ఎమ్మెల్యే గుంటి వెంకటేష్‌ప్రసాద్‌తో కలిసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి పుల్లంపేట-చిట్వేలి వాసుల సౌకర్యార్థం ఈ తారురోడ్డును ఏర్పాటు చేయించాము. ఆగమేఘాల మీద ఈ కొండమార్గంలో కొండలను, లోయలను చదును చేయించి రెండేళ్లలో పూర్తి చేయించాం. ఆనాడే 5 కోట్లు పైబడి ఖర్చు అయి ఉంటుంది. అటువంటి మార్గాన్ని సద్వినియోగం చేసుకుని బస్సులు నడిపి ఈ ప్రాంతీయులకు ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరచకపోవడం బాధాకరం.

- తొంబరపు సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్, చిట్వేలి

చాలా బాధ కలిగిస్తోంది..



చిట్వేలి-పుల్లంపేట మార్గంలో 15 ఏళ్ల కిందట ఘాట్‌రోడ్డుగా చిట్టడవుల్లో రోడ్డును ఏర్పాటు చేస్తే నేటికీ ఉపయోగించుకోకపోవడం చాలా బాధ అనిపిస్తుంది. అసలు ప్రజాప్రతినిధులు ఎందుకున్నారో అర్థం కాని పరిస్థితి. కొత్త రోడ్డు వేయాల్సిన పనిలేదు. ఉన్నరోడ్డు చాలా చక్కగా ఉంది. దీనిని వినియోగంలోకి తీసుకోవాల్సిన బాధ్యత ఇక్కడి ఎమ్మెల్యేకు కానీ, ప్రజా ప్రతినిధులకు కానీ లేకపోవడం విచారకరం. ఆర్టీసీ అధికారులు ఈ మార్గాన్ని ఒకసారి సర్వే చేసి బస్సులు నడిపితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

- నూకల రమేష్‌బాబు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, పుల్లంపేట


చిట్టడవి అందాల నడుమ చూడచక్కని పుల్లంపేట-చిట్వేలి ఘాట్‌రోడ్డు

ఖజానాలో సిబ్బంది ఖాళీ


జిల్లా ఖజానా కార్యాలయంలో ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

- విధులకు ఒకరు, ఇద్దరు మాత్రమే హాజరు
- బిల్లులు ఆన్‌లైన్‌లో చేస్తున్నామంటున్నారు
- ఇదీ జిల్లా ఖజానా కార్యాలయం తీరు

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న వివిధ శాఖలకు పద్దుల రూపంలో డబ్బులు చెల్లించే జిల్లా ఖజానా కార్యాలయంలో సిబ్బంది సమయానికి రాక కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ కార్యాలయంలోని కొంతమంది ఉద్యోగులు అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హార్టికల్చర్, అగ్రికల్చర్, డిస్ట్రిక్ ఇండస్ట్రియల్, రెవెన్యూ హాస్టల్స్ వారికి బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆఫీస్‌కు వచ్చి రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోతున్నారని తెలిసింది. బిల్లులు ఆన్‌లైన్‌లో పంపించండి.. మేము పూర్తి చేస్తామని కొంతమంది ఖజానా కార్యాలయ సిబ్బంది సెలవిస్తున్నారని తెలిసింది. ఇక్కడ దాదాపు 18మంది సిబ్బంది ఉండగా కేవలం నలుగురు మాత్రమే హాజరవుతున్నారని సమాచారం. ఈ విషయమై ఎవరైనా ప్రశ్నిస్తే ఆ సెక్షన్‌లో ఉన్నవాళ్లు సమయానికి రాలేదు కాబట్టి మేము కూడా సమయానికి రాలేదని ఒకరిపై మరొకరు చాడీలు చెప్పుకుంటున్నారు. ఇలా ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ ఆఫీసుకు సమయానికి రావడం లేదన్న వాదన ఉంది. ఏదైనా బిల్లు వస్తే కింది స్థాయి ఎస్టీవోకు ఫార్వర్డ్ చేయడం అది ఏమని అడిగితే మీరు చూసుకోండి అని సమాధానం ఇస్తున్నారని తెలిసింది. కొంతమంది ఆఫీస్‌కు రాకుండా బిల్లులు వాట్సాప్‌లో పెట్టండి అని విచిత్ర సలహాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న ఏటీవో డిప్యూటేషన్‌పై రాజంపేటకు వెళ్లిపోయారు. ఆ సీటు ఖాళీగా దర్శనమిస్తోంది. అంతేగాకుండా ఇంత పెద్ద ఆఫీసుకు కనీసం ఒక అటెండర్ కూడా లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉందని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది చెప్పుకొస్తున్నారు. ఈ ఆఫీసులో పనిచేస్తున్న అటెండర్‌కు ప్రమోషన్ వచ్చి రాజంపేటకు వెళ్లిపోయింది. కనీసం ఇద్దరు అటెండర్లు ఉండాల్సినటువంటి ఈ కార్యాలయానికి ఒక్క అటెండర్‌ను కూడా భర్తీ చేయలేదు. ఇప్పటికైనా ఈ కార్యాలయంలో ఉన్న సిబ్బందిని సమయపాలన పాటించి ఉద్యోగానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరు తున్నారు. ఈ విషయమై జిల్లా ఖజానాధికారి మహబూబ్‌ను వివరణ కోరగా తన కింద పని చేస్తున్న ఉద్యోగులు ఎవరూ సమయానికి రావడం లేదు. నా మాట ఎవరూ వినడం లేదు. అందుకే నేను లీవ్ పెట్టి వెళ్లిపోతు న్నాను అని చెప్పడం గమనార్హం.

రాజంపేట మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

- విధుల్లో నిర్లక్ష్యం.. ప్రభుత్వ ఉత్తర్వులు ఖాతరు చేయకపోవడం
- మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ


సస్పెన్షన్‌కు గురైన కమిషనర్ నాగేశ్వరరావు

రాజంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల్లో కమిషనర్‌గా నాగేశ్వరరావు విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రధానంగా మున్సిపల్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాల పట్ల అలసత్వం వహించడం ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేశారని తెలిపారు. రాజంపేట మున్సిపాలిటీలో పారిశుధ్యం గురించి పట్టించుకోకపోవడం, పట్టణంలో క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో పట్టణంలో పారిశుధ్య సమస్య ఎక్కువైందని తెలిపారు. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి మున్సిపల్ కార్యాలయంలోని కొందరు అధికారులతో ఈ సస్పెన్షన్‌పై ఆరా తీయగా కమిషనర్ జాయిన్ అయినప్పటి నుంచి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిసింది. ప్రధానంగా జనవరి 16న మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్రస్థాయిలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్లక్ష్యంగా మాట్లాడటం, ఉన్నతాధికారుల మాటలను బేఖాతరు చేస్తూ మాట్లాడిన మాటలకు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

చట్ట పరిధిలో పరిష్కరించాలి : ఎస్పీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని వారి ఫిర్యాదులను పరిశీలించారు. వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు.


ఫిర్యాదుదారుడి దగ్గరికి వెళ్లి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

కరువులో రైతుకు ఆసరా పాడి

- డెయిరీతో ఆర్థిక ఆదాయం
- కష్టపడితే ఫలితం ఉందంటున్న రైతు

6




బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారు

- హెచ్‌ఎన్‌ఎస్ భూమిని అమ్మేసిన వారిపై చర్యలేవి?
- 1.60 ఎకరాల భూమి ఆక్రమించి కోట్లు దండుకున్నారు..
- బాధితులకు న్యాయం జరిగేనా..

కురబలకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువ కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని ప్లాట్లు వేసి అమ్మేసిన భూమిలో రెవెన్యూ అధికారులు బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారు. జిల్లాలోనే కురబలకోట మండలం అంగళ్లుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఈ ప్రాంతం ప్రముఖ విద్యాసంస్థలకు కేంద్రంగా ఉండటంతో సుదూర ప్రాంతాలకు చెందిన ఎంతో మంది ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. దీంతో ఈ ప్రాంతం వాణిజ్యపరంగా అభివృద్ధి కావడంతో భూముల ధరలు నింగినంటాయి. కాగా విద్యాసంస్థల చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల ధరలు ఎకరం రూ.3 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు అమ్ముతోంది. దీంతో ఇక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపా రం బాగా జరగడంతో వ్యాపారులు కోట్లు గడించారు. అయితే వ్యాపారం ముసుగులో చాలా ప్ర భుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఆ భూమిలో ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారు. మండల పరిధిలో కొంతమంది రియల్టర్‌లు ప్లాట్ల కోసం కొనుగోలు చేసిన భూమికి ఆనుకుని హంద్రీ-నీవా కాలువకు చెందిన భూమి ఉండటంతో దానిని ఆక్రమించుకుని ప్లాట్లు వేసి విచ్చలవిడిగా అమ్మేశారు.

220 సర్వే నెంబర్‌లో ప్రభుత్వం రైతుల నుంచి 6.40 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసింది. కాలువ నిర్మాణం పూర్తి కావడంతో ఇంకా కొంత భూమి మిగిలి ఉంది. ఆ భూమిని ఆనుకుని ఉన్న భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసి ఆ భూమికి హంద్రీ-నీవా కాలువకు సంబంధించిన భూమిని 1.60 ఎకరాల భూమిని కలుపుకుని కొందరు ప్లాట్లు వేసి కోట్లాది రూపాయలు గడించారు. వ్యాపారులు, మధ్యవర్తులు డబ్బుల కోసం కక్కుర్తి పడి మోసపూరిత మాటలతో అమాయకులను నమ్మించి అమ్మేశారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసిన చాలామంది మోసపోయారు. ప్లాట్లు వేసి దర్జాగా కోట్లు గడించిన వారు వ్యాపారాలు చేసుకుంటూ ఆనందంగా కాలం వెళ్లదీస్తున్నారు. అయితే కొనుగోలు చేసిన వారికి న్యాయం ఎలా జరుగుతుందో తెలియడం లేదు. గతంలో ఇక్కడ రెవెన్యూలో పనిచేసే కొంతమంది రియల్ వ్యాపారులకు అండదండలు అందించడంతోనే వాళ్లు ఇంత ధైర్యంగా ప్లాట్లు వేసి అమ్మేశారని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. కాగా దీనికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో 'రియల్ వ్యాపారుల బరితెగింపు' హంద్రీ-నీవా కాలువను అమ్మేశారు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో రెవెన్యూ, హంద్రీ-నీవా అధికారులు ఆక్రమణకు గురైన భూమిలో బోర్డును ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ విషయం వెలుగులోకి వచ్చి దాదాపుగా 4 నెలలు కావస్తున్నా అక్రమార్కులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్లాట్లు వేసి అమ్మేసిన వారు తమను ఎవరు ఏమి చేస్తారో చూద్దాం లే అని దర్జాగా తిరుగుతున్నా చట్టపరంగా వారికి ఇప్పటి వరకు నోటీసులు ఇచ్చిన పాపాన పోలేదు. తప్పు చేసిన వారిని ఇలాగే వదిలేయడం వలన భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు తిరిగి జరిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కొనుగోలు చేసిన బాధితులకు న్యాయం ఏమాత్రం జరుగుతుందో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులపై ఏమాత్రం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

జేసీకి నివేదిక అందించాం..



మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్-220లో ఆక్రమణకు గురైన హంద్రీ-నీవా కాలువ భూమికి సంబంధించి రియల్టర్‌లు ప్లాట్లు వేసి అమ్మేయడంపై జేసీకి నివేదిక అందజేశాం. దీనికి సంబంధించి భూమిలో బోర్డును ఏర్పాటు చేశాం. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి హెచ్‌ఎన్‌ఎస్ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం. అలాగే ఉన్నతాధికారుల దృష్టికి మరోసారి తీసుకెళతాము. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తులు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దు. పేదలు, మధ్యతరగతి ప్రజలు జీవితాంతం కష్టపడి సంపాదించిన సొమ్మును పోగొట్టుకోవద్దు. దీనిపై ఏవైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి.

- తపస్విని, తహశీల్దార్


అంగళ్లు సమీపంలో హెచ్‌ఎన్‌ఎస్ భూమిలో ప్లాట్లు వేసి విక్రయాలు జరిపిన భూమి


ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఏర్పాటు చేసిన బోర్డు

కరువులో రైతుకు ఆసరా 'పాడి'



హరియాణా నుంచి తెచ్చిన గేదెలు

- డెయిరీతో ఆర్థిక ఆదాయం
- కష్టపడితే ఫలితం ఉందంటున్న రైతు

సంబేపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం జూదంలా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో రైతులను పాడి పరిశ్రమ ఆదుకుంటోంది. రైతులు పంటలు సాగు చేయడం ప్రకృతి విపత్తులతో నష్టపోవడం సహజంగా జరుగుతోంది. దీంతో రైతు పాడి పరిశ్రమ వైపు దృష్టి సారించారు. ఒకప్పుడు ఇంటిలో ఒకటి, రెండు లోపు పాడి ఆవులు, గేదెలు పెంచేవారు. వీటితో కుటుంబ అవసరానికి సరిపడే పాలు, పెరుగు వచ్చేది. ప్రస్తుతం మార్కెట్‌లో పాల దిగుబడులకు మంచి గిరాకీ ఏర్పడడంతో రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. ఈ తరుణంలో పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకుని పాలు అమ్ముతూ ప్రతి నెలా ఆర్థికంగా సంపాదించడం విశేషం. కరువు పరిస్థితుల నుంచి ప్రస్తుతం పాడి పరిశ్రమ రైతులను ఆదుకుంటోంది. ఇందుకు నిదర్శనం రైతు సహదేవరెడ్డి. ఊరు సంబేపల్లె మండలం ప్రకాశ్‌నగర్‌కాలనీ గుండ్రేవాండ్లపల్లె. 30 గేదెలను హరియాణా రాష్ట్ర జింద్ ప్రాంతం నుంచి తెచ్చారు. వీటిలో 20 నుంచి 25 పాడి గేదెలు పాలు ఇస్తున్నాయి. ప్రతిపూట 100 లీటర్ల చొప్పున రోజుకు రెండు పూటలా 200 లీటర్లు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఒక లీటర్ ధర 70 నుంచి 80 రూపాయలు ఉండడంతో నెలకు సుమారు నాలుగు లక్షల రూపాయలు ఆదాయం వస్తున్నట్లు చెబుతున్నాడు. దీంట్లో 50 శాతం ఖర్చు పోయినా కష్టపడితే మంచి ఆదాయం వస్తుందంటున్నారు రైతు.



గేదెల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు



పశుగ్రాసాన్ని ముక్కలుగా కోసే మిషన్

మేలు రకపు గేదెల ఎంపిక

రైతులు అధిక పాలు దిగుబడి ఇచ్చే పాడి గేదెలను ఎంపిక చేసుకోవాలి. ఒక్కో పూట గేదె ఎనిమిది నుంచి పది లీటర్ల పాల దిగుబడి వచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి. రైతు హర్యానా రాష్ట్రం జింద్ ప్రాంతంలో గేదెలను ఎంపిక చేసుకుని 30 గేదెలను కొనుగోలు చేశారు. వీటికోసం మూడు రేకుల షెడ్‌లను నిర్మించారు. ఒక్కొక్కటి సుమారు 7 లక్షల రూపాయలు ఖర్చు చేసి మూడు రేకుల షెడ్లు నిర్మించుకున్నట్లు తెలియజేశారు. గేదెను పట్టి లక్ష పది వేల నుంచి సరాసరి రూ.1.50 లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసినట్లు తెలిపారు. హర్యానా నుంచి రావడానికి 10 గేదెలకు సుమారు లక్షన్నర రూపాయలు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను భరించినట్లు తెలియజేశారు. రైతు ఆశించిన పాల దిగుబడి రాకపోతే నష్టాలు వస్తాయని తెలియజేశారు.

వ్యవసాయం గిట్టుబాటు కాలేదు

వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. పెట్టుబడులు పెరిగిపోయాయి. పంట దిగుబడులు సక్రమంగా రాలేదు. దీంతో పాడిని ఎంచుకున్న పాల దిగుబడితో మంచి ఆదాయం వస్తోంది. పలువురికి ఉపాధి కల్పించడం సంతోషంగా ఉంది. కష్టపడి పనిచేస్తే పాడి పరిశ్రమలో మంచి ఆదాయం పొందవచ్చు.

- సహదేవరెడ్డి, రైతు, గుండ్రేవాండ్లపల్లె

పశువులకు వినియోగించే దాణా రకాలు

పాల దిగుబడి పెరగాలంటే వాటికిచ్చే పశుగ్రాస గడ్డితో పాటు దాణాకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నారు రైతు. ఈ గీతల కోసం పత్తి చెక్క, మొక్కజొన్న, పొట్టు అలసంద, గోధుమపిండి, గోధుమ పొట్టు రకాలతో పాటు అమెరికల్ బుల్లెట్ రకం గడ్డిని కూడా తెలిపారు. గేదెలకు సరిపడే గడ్డి వేస్తున్నట్లు రైతు తెలిపారు.



గేదెలకు వాడుతున్న దాణా



సాగులో ఉన్న అమెరికన్ బుల్లెట్ రకం గడ్డి

బినామీ పేరుతో పోలీసు అధికారి భూకబ్జా

- సబ్‌కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు



పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వారసత్వంగా తమకు వచ్చిన భూమిని ఓ పోలీసు అధికారి బినామి పేరుతో ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కురబలకోట మండలానికి చెందిన నరసింహులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. తమ తాతల నుంచి సంక్రమించిన భూమిని మదనపల్లెలో పనిచేసిన పోలీసు అధికారి బినామి పేరుతో ఆక్రమించి, బెదిరిస్తున్నాడని కురబలకోట మండలం ఎర్రబల్లి పంచాయతీ కంటేవారిపల్లెకు చెందిన రైతు నరసింహులు ఫిర్యాదు చేశాడు. తమ పొలాలకు దారి లేకుండా ఓ మాజీ ప్రజాప్రతినిధి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మదనపల్లె మండలం పొన్నేటిపాలెం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ ఆముదాలకాలువ గ్రామంలో బోరు ఎండిపోయిందని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు విన్నవించారు. ఇలా డివిజన్‌లోని 11 మండలాల నుంచి 48 మంది సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందించగా, ఆయా మండలాల అధికారులు సకాలంలో సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు



ముద్దాయి షేక్ ఇలియాజ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళలపై కిరోసిన్ పోసి నిప్పంటించడానికి ప్రయత్నించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ సోమవారం రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన తీర్పు ఇచ్చారు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని కొత్తపల్లె మహబూబ్ నగర్‌కు చెందిన షేక్ ఇలియాజ్ 2022 జూన్ 1వ తేదీ రాత్రి 9.30 గంటలకు ఇంటి బయట కూర్చుని ఉన్న మహబూబ్‌జాన్ అనే మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నిస్తుండగా, ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడికి చేరుకున్నారు. దీంతో నిందితుడు పారిపోగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు రాయచోటి అర్బన్ ఎస్ఐ మహమ్మద్‌రఫీ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితుడికి పై మేరకు శిక్ష విధిస్తూ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన తీర్పు ఇచ్చారు.

మద్యం విక్రేత అరెస్ట్



పోలీసులకు పట్టుబడిన రామయ్య, మద్యం సీసాలు

సిద్దవటం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీ నిర్మలగిరి కాలనీలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో కుంభగిరి రామయ్య(50) ఇంట్లోని ఓ బ్యాగులో 10 మద్యం సీసాలు పట్టుబడడంతో, స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. స్థానిక పోలీసులు శివప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేయడానికి వెళితే దుర్భాషలాడాడు

- సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులుపై ఎస్పీకి ఫిర్యాదు



మీడియా ఎదుట కన్నీటి పర్యంతమవుతూ తన గోడును విన్నవిస్తున్న బాధితురాలు చంద్రకళ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ స్థలంలో పునాది వేస్తుంటే కొంత మంది రౌడీలు దౌర్జన్యం చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయడానికి సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు దగ్గరకు వెళితే ముందు బయటకు వెళ్లండి లేకుంటే బూటుకాళ్లతో తంతానంటూ దుర్భాషలాడాడని సుండుపల్లె మండలం రాయవరం గ్రామం మిట్టమీదపల్లెకు చెందిన రామాంజులు భార్య మడితాడు చంద్రకళ సోమవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు ఎస్పీ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ తమ సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి పునాది వేస్తుంటే రాయవరం కస్బాకు చెందిన రౌడీలు భద్రి రమేశ్, మడితాడు బాబు, పవన్‌కుమార్, సాయికుమార్, ప్రవీణ్‌లతో పాటు మరో ముగ్గురు వచ్చి దౌర్జన్యం చేయడమే కాకుండా దాడికి ప్రయత్నించారని తెలిపారు. ఈ విషయంపై సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఎస్ఐ శ్రీనివాసులు మా దగ్గరకి ఎందుకు వచ్చారు. నేను ముందే చెప్పాను కదా వాళ్లు చంపేస్తారని, నువ్వు పోలీస్‌స్టేషన్ నుంచి బయటికి వెళ్లిపో లేదంటే బూటుకాళ్లతో తంతాను అని దుర్భాషలాడడమే కాకుండా ఫిర్యాదు తీసుకోకపోవడంతో చంద్రకళ రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌కు ఫిర్యాదు చేసేందుకు రాయచోటికి వెళుతుండగా రాయచోటి రోడ్డు మార్గంలో అనుంపల్లి సమీపంలో ఆ రౌడీలు భద్రి, ప్రవీణ్ మరికొంత మందిని మా వెంట పడడమే కాకుండా ద్విచక్ర వాహనంలో వస్తున్న మమ్మల్ని చేజింగ్ చేసి గొడ్డళ్లు, రాళ్లతో వెంటబడి హత్యా ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. నాకు ఆ రౌడీల నుంచి ప్రాణహాని ఉందని, న్యాయం చేయాలంటూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశామని మడితాడు చంద్రకళ తెలియజేశారు.

మా భూమిని మాకు ఇప్పించండి!

- 26 సెంట్లు కొనుగోలు చేసి 26 ఎకరాలు ఆక్రమించుకున్నారు
- రికార్డులు లేకుండానే వారికి పాసుబుక్కులు ఇచ్చేశారు
- రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా రెవెన్యూ అధికారులు
- పీలేరులో అర్చకుడు ఆనంద శర్మ ఆరోపణ



వివరాలు తెలుపుతున్న అర్చకుడు ఆనంద శర్మ

పీలేరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎటువంటి విక్రయ దస్తావేజులు లేకుండానే కొంత మంది ఆక్రమణదారులు తమ పూర్వీకుల ఆస్తిని కాజేశారని, వారి చెరలో ఉన్న తమ భూమిని తమకు తిరిగి ఇప్పించాలని పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ శివరామాపురానికి చెందిన అర్చకులు ఆనంద శర్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీలేరులో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తన తాత అయిన గర్నిపూడి రామయ్యకు దొడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో 26 ఎకరాల భూమి ఉండేదన్నారు. 1926లో అప్పటి చిత్తూరు జిల్లా బోర్డు సభ్యుడు అయిన ఊసు పాపిరెడ్డి విజ్ఞప్తి మేరకు పీలేరు-మదనపల్లె మార్గంలోని బడబళ్లవంకపై వంతెన నిర్మించేందుకు 26 సెంట్ల భూమిని విక్రయించారన్నారు. అయితే తదనంతర కాలంలో ఊసు పాపిరెడ్డి వారసులు ఆ 26 సెంట్లను ఏకంగా 26 ఎకరాలుగా మార్చి, నకిలీ దస్తావేజులు సృష్టించి తమ భూములను ఆక్రమించుకున్నారన్నారు. వాటిపై 2014 నుంచి 2022 సంవత్సరాల కాలంలో పలుదఫాలుగా వారికి పాసుపుస్తకాలను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారన్నారు. ఆక్రమణదారుల వద్ద ఎటువంటి కొనుగోలు దస్తావేజులు లేకపోయినా నోషనల్ ఖాతాల ద్వారా పాసుపుస్తకాలు అందజేశారన్నారు. నోషనల్ ఖాతాల ద్వారా పాసు పుస్తకాలు మంజూరు చేయరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. సుదీర్ఘ పోరాటం చేసినప్పటికీ లాభం లేకపోవడంతో తాను మదనపల్లెలో జరిగిన రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాకు వినతి పత్రం అందజేశానన్నారు. అంతే కాకుండా ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లోనూ వినతి పత్రం అందించానన్నారు. ఆ వినతి పత్రం విచారణ కోసం పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు ఆదివారం క్షేత్రస్థాయి పర్యటకు వచ్చారన్నారు. ఆయన రికార్డులు పరిశీలించకుండానే భూమి ఎవరి అనుభవంలో ఉంటే వారికే చెందుతుందని సమాధానం చెప్పారని వాపోయారు. పేద బ్రాహ్మణులైన తాము స్థానికంగా జీవనాధారం లేకపోవడంతో అర్చకత్వం వృత్తిగా స్వీకరించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జీవనం సాగించామన్నారు. ఆ భూములను గతంలో తాము పలుమార్లు కౌలుకు ఇద్దామని ప్రయత్నించినప్పటికీ ఆక్రమణదారులు అడ్డుకున్నారన్నారు. ఆ విషయాలన్నింటినీ తాను తహసీల్దారుకు విన్నవించినా ఆయన పట్టించుకోలేదన్నారు. తన వినతి పత్రంపై విచారణను వీలైనంత త్వరగా ముగించేయాలన్న తొందరలో ఉన్నారన్నారు. తనకు న్యాయం చేయాలని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం చేయాలని, న్యాయం జరగని పక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రెవెన్యూ ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామన్నారు.

జీవోలను అమలు చేయండి

- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్



రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మినిట్స్ కాపీలో ఇచ్చిన జీవోలను వెంటనే అమలు చేయాలంటూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాయచోటి ప్రాజెక్టు కార్యదర్శి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు ధర్నా చేశారు. రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టులోని అధికారులు సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. దిగువరాజుగారిపల్లె హెల్పర్ రెండేళ్ల నుంచి విధులకు రాకపోయినా ఆమె పైన చర్యలు తీసుకోకపోవడానికి అధికారులకు ఆ హెల్పర్‌కు మధ్య ఉన్న మతలబు ఏంటని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బంగారుపాప, యూనియన్ లీడర్లు అరుణ, విజయ, షబీనా, సుమలత, సురేశ, పద్మజ, శంకరమ్మ, పద్మజ, జయమ్మ, లక్ష్మీదేవి, షబాణా, శైలజ, అంజలి, శ్రీదేవి, కళ తదితర వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తబస్సులు ప్రారంభం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):మదనపల్లె వన్ డిపోకు చెందిన కొత్తబస్సులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిపోలకు 25 నూతన బస్సులు రానున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. మదనపల్లె వన్ డిపో నుంచి బళ్లారి, హైదరాబాదు, తిరుపతి టూడిపో నుంచి విజయవాడ, తిరుపతిలకు కొత్తబస్సులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎంలు మూరే వెంకటరమనారెడ్డి, అమరన్నాథ్, ఆర్టీసీ యూనియన్ నాయకులు, టీడీపీ నాయకులు గుత్తికొండ త్యాగరాజ, జేసీబీ మధు, గురునాథ్, జాన్‌బాబు, జేసీబీ వేణు, మోహన, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సిద్దవటం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పొట్టేళ్ల కొనుగోలు చేసి, డబ్బు ఇవ్వకుండా మోసం చేసిన ఇద్దరిపై సిద్దవటం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కాజిపల్లెకు భాస్కర్‌రెడ్డికి చెందిన 7 పొట్టేళ్లను గత ఏడాది జూలైలో కడప నగరానికి చెందిన సుబ్బారెడ్డి, బాషా రూ. లక్ష రూపాయలకు కొనుగోలు చేశారు. పది రోజుల్లో డబ్బు చెల్లిస్తామని చెప్పి మోసం చేశారంటే ఫిబ్రవరి 12న కడప ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేసిన పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ప్రసాద్

నందలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు బస్టాండు కూడలిలో సోమవారం సాయంత్రం బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. మాధవరం నుంచి తాళ్లపాకకు బైకుపై వెళుతున్న కమ్మినేని ప్రసాద్, శ్రీకళ దంపతులను కడప నుంచి రాజంపేటకు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన దంపతులను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కడప జిల్లాకు రానున్న 20 సూత్రాల చైర్మన్ రాక

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర 20వ సూత్రాల చైర్మన్ లంక దినకర్ ఈనెల 18వతేదీ మంగళవారం కడపకు రానున్నారు. 17వ తేదీ రాత్రి 8-05 గంటలకు విజయవాడ నుంచి రైలులో బయలుదేరి 18న ఉదయం 7-30 గంటలకు కడప స్టేట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 10-30 గంటల నుంచి కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లా రివ్యూ మీటింగ్‌ను 2 గంటల వరకు నిర్వహిస్తారు. అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహిస్తారు. సాయంత్రం 5-30 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రికి శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి చేరుకుని అక్కడే బస చేస్తారు.

రూ.10కోట్ల స్థలంలో పార్కు



నిరుపయోగంగా ఉన్న వైఎస్ఆర్ పార్కు



చెట్ల కింద బండలను పగలగొట్టిన దృశ్యం



పార్కులో పడేసిన మద్యం బాటిళ్లు

- అలనా పాలనలేక నిరుపయోగం
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల పట్టణ నడిబొడ్డున దాదాపు రూ.10కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన పార్కు ఆలనా పాలన లేక నిరుపయోగంగా మారింది. గతంలో ఈ పార్కు ప్రాంతంలో ఆర్అండ్‌బీ అతిథి గృహం ఉండేది. దివంగత మంత్రి వీరారెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన ఈ అతిథి గృహాన్ని అప్పట్లో అధికారులకు, మంత్రులకు విడిదిల్లుగా ఉపయోగించేవారు. అలాగే ప్రభుత్వ బహిరంగసభలకు, డ్వాక్రా మహిళల సమావేశాలకు ఉపయోకరంగా ఉండేది. కాలక్రమంలో అతిథిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో గత వైసీపీ ప్రభుత్వం లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చొరవ తీసుకుని వైఎస్ఆర్ పార్కును ఏర్పాటు చేశారు.

పోరుమామిళ్ల పట్టణ ప్రజలకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండే విధంగా సుమారు రూ.25లక్షల వ్యయంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్కు నిర్మించారు. అప్పట్లో పట్టణవాసులు తమ కుటుంబ సభ్యులతో ఇక్కడ సేదదీరేవారు. చిన్నారుల కోసం జారుడుబండ, ఉయ్యాల ఏర్పాటు చేశారు. అటువంటి పార్కు నిర్వహణ లేని కారణంగా అధ్వానంగా తయారై నేడు మందుబాబులకు నిలయంగా మారింది. పార్కులో ఎక్కడ పడితే అక్కడ మందుబాబులు తాగి పడేసిన మద్యం బాటిళ్లు దర్శన మిస్తున్నాయి. ఇక పార్కులో చెట్ల చుట్టూ సేదదీరేందుకు గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసిన అరుగులను ఆకతాయిలు ధ్వంసం చేశారు. ఎవరైనా జోక్యం చేసుకుని మందలిస్తే వారిపై ఎదురు తిరిగిన సంఘటనలు ఉన్నాయి. రూ.కోట్లు విలువైన ఈ స్థలంలో ప్రజల కోసం పార్కు ఏర్పాటు చేస్తే అది ఇప్పుడు నిరుపయోగంగా మారింది. దీనిపై దృష్టి పెట్టకపోతే అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే అవకాశాలున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాయకులు చొరవ తీసుకుని పార్కును పునరుద్ధ రించి అందరికీ ఉపయోగపడే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పోరుమామిళ్ల పంచాయతీ అధికారి రవిశంకరరెడ్డిని వివరణ కోరగా... ఆ పార్కును ఇంత వరకు ఎవరూ తమకు స్వాధీనం చేయలేదన్నారు.

శ్మశానం ఉన్నా ఇళ్ల మధ్యనే శవాన్ని పూడ్చివేయడం దారుణం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



ఇళ్ల మధ్యలో శవాన్ని పూడ్చివేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట గ్రామస్థులకు శ్మశాన వాటిక ఉన్నా పేదల గుడిసెల మధ్యనే శవాన్ని పూడ్చివేయడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. సోమవారం భాకరాపేట సమీపంలోని సీపీఐ కాలనీలో ఆదివారం భాకరాపేట గ్రామస్థులు శవాన్ని పూడ్చివేసిన స్థలాన్ని, కాలనీకి సమీపంలో ఉన్న భాకరాపేట శ్మశాన వాటికను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శ్మశాన వాటికలకు ఎప్పుడూ తమ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. అయితే భాకరాపేట గ్రామస్థులను కొందరు భూ ఆక్రమణదారులు రెచ్చగొట్టి తమ స్వలాభం కోసం పేదల కాలనీలో ఇళ్ల మధ్యనే శవాన్ని పూడ్చిపెట్టేందుకు వచ్చారన్నారు. ఇందుకు సీపీఐ నాయకులు నిర్మాణాలున్న చోట కాకుండా కాస్త దూరంలో అంత్యక్రియలు జరపాలని అభ్యర్థించినా వారు మాట వినలేదని.. ఇందులో భూఆక్రమణదారుల కుట్ర ఉందన్నారు. భాకరాపేట గ్రామస్థులను ప్రేరేపించిన భూ ఆక్రమణదారుల బాగోతం త్వరలోనే సీపీఐ బయటపెట్టి తగిన గుణపాఠం చెబుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, బాలు, డీహెచ్‌పీఎస్ నాయకులు పడిగ వెంకట్రమణ, సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి





ప్రమాద స్థలిలో సుబ్బయ్య మృతదేహం, సుబ్బయ్య (ఫైల్)

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి జాతీయ రహదారి గొల్లపల్లె గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కంబాల సుబ్బయ్య (45) మృతి చెందినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. దేవునికడపకు చెందిన కంబాల సుబ్బయ్య తాడిపత్రి ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున కడప నుంచి ఎర్రగుంట్ల వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గొల్లపల్లె సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శిరీషా, ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ తరలించి... కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

చెన్నూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రభారతిపేటలో మంగపట్నం మధుసూదన్ (43) అనే వ్యక్తి సోమవారం ఉదయం ఉరి వేసుకుని మృతి చెందాడు. కార్పెంటరుగా పనిచేసి జీవనం సాగించే మధుసూదన్ తల్లి వెంకటసుబ్బమ్మ ఆదివారం మృతి చెందింది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతునికి మానసిక వికలాంగుడైన ఓ అన్న ఉన్నాడని, తమ్ముని మరణంతో అతడు అనాథగా మిగిలాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మధుసూదన్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విషద్రావణం తాగి వ్యక్తి మృతి

సికెదిన్నె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరుకు చెందిన శీలం సుబ్బరాయుడు అనే వ్యక్తి విషద్రావణం తాగి మృతి చెందాడు. సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. సుబ్బరాయుడు తన మొదటి భార్య కుమార్తె పుష్పలతను ప్రొద్దుటూరు ఖాదర్‌బాద్‌కు చెందిన కురాక్ వెంకటసుబ్బయ్యకు ఇచ్చి వివాహం జరిపించాడు. వారికి ఒక కుమార్తె సంతానం. అయితే గత కొంత కాలంగా పుష్పలత వేరే వ్యక్తితో చనువుగా ఉంటూ అతనితో కలిసి వెళ్లిపోయింది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ చేసినప్పటికి ఆమె అతనితోనే ఉంటానని చెప్పడంతో పరువు పోతుందని భావించి కలత చెందాడు. దీంతో జీవితంపై విరక్తితో ఆదివారం రాత్రి విషద్రావణం తాగాడు. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలోని రిమ్స్ పీఎస్ పరిధిలో నాగముని (45) అనే మహిళ సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. నాగముని తన తండ్రి ప్రసాద్ వద్ద ఉంటూ టిఫిన్ సెంటరు పెట్టుకుని జీవనం సాగించేవారు. అయితే తన తల్లి చిన్న చిన్న సమస్యలకు కూడా మానసికంగా బాధపడేదని.. ఈ నేప థ్యంలో క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుమారుడు దీపక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిరుతపులివి కాదు.. కుక్క జాతి జంతువు అడుగులు

- ముద్దనూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వెల్లడి



రైతులతో మాట్లాడుతున్న డీఆర్ఓ శ్రీనివాసులు

లింగాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): లింగాలలో ఆదివారం వాసుదేవరెడ్డి పొలంలో గమనించిన అడుగులు చిరుతపులివి కాదని ముద్దనూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన లింగాలలోని వాసుదేవరెడ్డి పొలంలోని అడుగులను పరిశీలించారు. ఇవి కుక్కజాతి జంతువు అడుగులని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. కానీ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనంతరం లింగాల తహసీల్దార్ ఈశ్వరయ్యను కలిసి సంఘటనకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. అలాగే అడవి జంతువుల నుంచి ఏ విధంగా రక్షించుకోవాలో తెలియజేసే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ గోపాలకృష్ణ, మహబూబ్ బాష పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- గోడ పత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్ శ్రీధర్



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, విద్యుత్ అధికారులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో విద్యుత్ ప్రమాదాలను అరికట్టడంలో సూచనలపై వీడియో, ఆడియో, పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేబుల్ నెట్ వర్క్ టీవీల ద్వారా, ప్రొజెక్టర్ల ద్వారా విద్యుత్ భద్రత నియమాలపై వీడియో ప్రదర్శిస్తే అర్థం చేసుకోవడానికి సులభంగా ఉంటుందన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచగలిగితే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఇంటికీ విధిగా ఎర్తింగ్ ప్రమాణాలు కలిగిన విద్యుత్ పరికరాలను, ముఖ్యంగా వ్యవసాయ బోర్ల వద్ద భద్రత నియమాలు విధిగా పాటించాలన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన విద్యుత్ ప్రమాదాలు తీవ్ర దుఃఖాన్ని కలిగించాయన్నారు. ప్రాణం చాలా విలువైనదని... ఇంటి పెద్దను కోల్పోతే ఆ కుటుంబసభ్యులు పడే వేదన, ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపతాయన్నారు. విద్యుత్ భద్రతా నియమాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీసీఈఓ ఓబుల మ్మ, విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీరు రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మధుసూదన్, హుస్సేన్ బాషా, మధుసూదన్‌రెడ్డి, నీరజ, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలి

- గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులను అడ్డుకున్న రైతులు
- రోడ్డుపై బైఠాయించి నిరసన



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు జాతీయ రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అనంతరం రోడ్డు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వివరాలిలా.. మండలంలోని మల్లేపల్లె గ్రామానికి చెందిన రైతులు బెంగుళూరు-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్నారు. దాదాపు 130 ఎకరాలకు 150 మంది రైతుల వద్ద నుంచి ప్రభుత్వ వాల్యు యేషను ప్రకారం ఎకరాకు రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని ఒప్పంద పత్రాలు తీసుకున్నారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూములతో జీవనం సాగిస్తున్నామని... ఈ భూములను కోల్పోతే తమకు ప్రత్యామ్నాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారుల పనుల జరిగే ప్రాంతంలో రైతన్నలు ఆందోళనకు దిగారు. ఉదయం 7గంటల నుంచి పనులు జరగకుండా వాహనాలను అడ్డగించి రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేపల్లె గ్రామ సర్పంచ్ భర్త, మాజీ డీసీసీ చైర్మన్ చిలమల నారాయణ, పలువురు రైతులు మాట్లాడుతూ ఉన్నఫలంగా మా భూములను రోడ్డు పనులకు లాక్కున్నారని... ఇప్పుడు మేం ఎలా జీవనం సాగించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.50లక్ష ల చొప్పున భూములు కోల్పోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈవిషయం తెలిసిన తహసీల్దారు దామోదర్ రెడ్డి అక్కడకు రావడంతో భూములు కోల్పోయిన రైతులు తమ ఆవేదనను వినతిపత్రం రూపంలో అందజేశారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి, టీడీపీ నేత చిలమల నారాయణ, నాగయ్య, రైతన్నలు జయరామిరెడ్డి, సత్యనారాయణ, నరసింహయ్య యాదవ్, రామ సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ లలిత



డాక్టర్ లలితకు నియామకపత్రం అందిస్తున్న వీసీ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.లలితను స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. డాక్టర్ లలితకు నియామకపు పత్రాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ అందజేశారు. ప్రతినెల 3వ శనివారం వైవీయూలో స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం అమలును పర్యవేక్షించడం, నివేదించడం వంటి బాధ్యతలను చూస్తారు. కార్యక్రమంలో ప్రభుత్వం జారీ చేసిన కార్యాచరణ మార్గదర్శకాలను అమలయ్యేలా పర్యవేక్షిస్తారు. కార్యక్రమంలో ఫిజిక్స్‌శాఖ సహ ఆచార్యులు డాక్టర్ వెంకటరామ్ పాల్గొన్నారు.

తలనీలాల వేలం వాయిదా



వేలం నిర్వహిస్తున్న అధికారులు

చక్రాయపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో భక్తులు సమర్పించే తలనీలాల కోసం వేలం నిర్వహించగా గుత్తేదారులు ఒకరే రావడంతో సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సోమవారం భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరిచిప్పలకు వేలం నిర్వహించారు. మొదటి పర్యాయం కూడా వాయిదా పడింది. రెండో పర్యాయం గుత్తేదారులు రాక వాయిదా పడింది. కొబ్బరిచిప్పలకు నలుగురు గుత్తేదారులు వచ్చినా సరైన ధర రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, బ్యాంకు అధికారులు, జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సహకారంతోనే యుడైస్ విజయవంతం : డీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష, ఎమ్మార్సీ సిబ్బంది సహకారంతో యుడైస్ విజయవంతమైందని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరం సీఎస్ఐ హైస్కూల్లో యుడైస్‌పై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మండల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష ఎమ్మార్సీ సిబ్బందిలో భాగమైన మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, సీఆర్పీ (సీఆర్ఎంటీ)ల సహకారంతోనే యుడైస్‌లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. పని ఒత్తిడి ఉన్నప్పటికీ ఎంతో ఓర్పుతో తక్షణ సమాచారం ఎప్పుడు అడిగినా మండల విద్యాశాఖాధికారులు పంపుతుండడం అభినందనీయమన్నారు. ఇలా అందరి సహకారంతో విద్యాశాఖలో జిల్లా దాదాపు అన్నింటా ముందు ఉందన్నారు. నమోదయ్యే ప్రతి పాఠశాల సమగ్ర సమాచారంతోనే పాఠశాలల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.నిత్యానంద రాజులు పేర్కొన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు వీరేంద్ర, దశరథరామిరెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల (స్కూల్ అసిస్టెంట్) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.నిత్యానందరాజు పేర్కొన్నారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు 19 నుంచి 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష కార్యాలయం, ఎన్జీఓ కాలనీ, కడపలో సమర్పించాలని తెలిపారు. పూర్తిసమాచారం వివరాల కోసం సమగ్ర శిక్ష కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మూగజీవాలకు పశువైద్య విద్యార్థుల గోడు



వైద్యం కోసం వచ్చిన మూగజీవానికి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా ఉపకార వేతనాలు పెంచాలని గత 15 రోజులుగా పశువైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మెబాటపై ఎలాంటి స్పందన లభించలేదు. దీంతో తమ సమ్మెలో భాగంగా సోమవారం పశువైద్య కళాశాలకు వైద్యం కోసం తీసుకువచ్చిన మూగజీవాలకు తమ న్యాయపరమైన కోర్కెలతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చి గోడును వెలుబుచ్చారు.

ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు శివతరుణ్ మాట్లాడుతూ గత 15 రోజులుగా స్టైపండ్ పెంచాలన్న డిమాండ్‌తో అధికారులు, రాజకీయ నాయకులకు విన్నవించుకున్నా ఏ ఒక్కరూ స్పందించి తమకు న్యాయం చేయలేదని వాపోయారు. కనీసం మూగజీవాలకు అయినా తాము పడుతున్న బాధలు అర్థమవుతాయన్న భావనతో వినతి పత్రం అందించి నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. తదనంతరం కళాశాల ఆవరణలో సమ్మెను కొనసాగించారు.

నేడు తలనీలాల సేకరణ హక్కుల వేలం

సిద్దవటం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిత్యపూజేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా తలనీలాలు సేకరించుకునే హక్కులకు మంగళవారం ఉదయం 11 గంటలకు సిద్దవటంలోని రంగనాథస్వామి ఆలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మోహన్ రెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు లక్ష రూపాయలు ధరావతు చెల్లించాలని తెలిపారు.

రేపు రామాపురం మండల సమావేశం

రామాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ సభా భవనంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాషువా తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

రేపు ద్విచక్ర వాహన ర్యాలీ

నందలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఈనెల 19న బుధవారం సాయంత్రం 4 గంటలకు మండలంలోని నాగిరెడ్డిపల్లె మారమ్మ ఆలయం నుంచి బస్టాండ్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకుడు పోతురాజు మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద బీజేపీ సీనియర్ నాయకుడు గోపినేని హిమగిరినాథ్‌యాదవ్ అల్పాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రాజంపేట పట్టణ సీఐగా పి.రాజా



రాజంపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణ సీఐగా పి. రాజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో నంద్యాల సీసీఎస్‌లో పనిచేసేవారు. రాజంపేటలో పని చేస్తున్న యల్లమరాజు రాయచోటి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది యల్లంరాజుకు వీడ్కోలు పలికి, కొత్త సీఐ రాజాకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గ్రంధే సత్యనారాయణ గుప్తా సోమవారం రాత్రి స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన సంఘం ఎన్నికల్లో ఆయనతోపాటు, ఏడుగురు సభ్యులు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వాహకులు, ఆర్యవైశ్యుల్లోని పెద్దలను సన్మానించారు.

వైభవంగా వినాయకుడి కల్యాణోత్సవం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్ లోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆల యంలో వినాయకుడికి కల్యాణోత్సవం కనుల పండువగా వైభవంగా నిర్వహించారు. ఈ కల్యా ణోత్సవానికి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు హాజరయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు ఆయనను పూలమాలతో ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ఆలయకమి టీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ గౌరవాధ్యక్షుడు కాలా సోముశేఖర్, అధ్యక్షుడు సిద్దులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆరు దశాబ్దాలుగా.. తీరని దాహార్తి

● ఇప్పటికీ బోరు నీరే దిక్కు ● దుస్థితిలో వెంకటాపురం ఎస్టీ కాలనీవాసులు ● తాగునీరు సరఫరా చేయాలని విజ్ఞప్తి





వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీ, తాగు నీటి కోసం పొరుగూరు వెళుతున్న మహిళలు

నందలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామం ఏర్పాటై ఆరు దశాబ్దాలు దాటినా మండలంలోని పాటూరు పంచాయతీ వెంకటాద్రిపురం ఎస్టీకాలనీ వాసులు రక్షిత మంచినీటికి నోచుకోలేదు. గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్ల నుంచి వచ్చే నీరు తాగడానికి పనికిరాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీలో దాదాపు 50 పైగా కుటుంబాలుండగా, సుమారు 250 మందికి పైగా జనాభా ఉంటుంది. కొంతమంది జీవాలను మేపుకుని కుటుంబాలను పోషించుకుంటుండగా, మిగతా అందరూ రోజువారీ కూలీలే. ఈ గ్రామం ఏర్పడి 60 ఏళ్ల దాటినా ఇప్పటి వరకూ ఆ గ్రామానికి తాగునీటిని అందించాలని అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గానీ ఆలోచించిన పాపాన పోలేదు. కాగా, మండలంలోని అన్ని పంచాయతీలకు చెయ్యేరు నుంచి తాగునీరు అందిస్తుండగా, ఈ గ్రామంలో మాత్రం రెండు బోర్లు ఏర్పాటు చేసి సరిపెట్టేశారు. ఆ బోర్ల నుంచి వచ్చే నీరు ఉప్పగా ఉండడంతోపాటు, చిలుము వాసన వస్తుండడంతో తాగేందుకు వీలు లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. ఆ బోర్ల నీటితో పాత్రలు కూడా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఎన్నికల ముందు నాయకులు హామీలు ఇస్తున్నారుగానీ, సమస్య పరిష్కరించిన వారు ఎవరూ లేరంటున్నారు. తాము గెలిస్తే చెయ్యేరు నుంచి పైపులైను వేయించి గ్రామంలో నీళ్ల ట్యాంకు కట్టించి తాగునీటిని అందిస్తామని, గత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసిన వారు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు. ప్రస్తుతం ఒక కిలోమీటరు దూరంలో ఉన్న నారాయణపేటకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ బాధను అర్థం చేసుకొని తాగునీరు సరఫరా చేసి పుణ్యం కట్టుకోవాలని కోరుకుంటున్నారు.

తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం



తాగునీటి కోసం నారాయణరాజుపేటకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ కొళాయిలకు నీరు వచ్చేనపుడే తెచ్చుకోవాలి. దీంతో పనులకు ఆటంకం కలుగుతోంది. మాకు జీవాలున్నాయి. వాటిని పోషించడం కూడా కష్టమవుతోంది. దయ ఉన్న మారాజులు తాగునీరు అందించాలి.

- ఉమ్మడి సుబ్బలక్షుమ్మ

అమలుకు నోచుకోని హామీలు



గ్రామంలోని తాగునీటి సమస్య నాయకులు పట్టించుకోలేదు. గ్రామంలోని బోరులో కూడా ఒక్కోసారి నీళ్లు రావు, అప్పుడు మా పరిస్థితి అగమ్యగోచరం. గ్రామం ఏర్పడి ఎన్నేళ్లైనా తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నాం. మా సమస్యను పరిష్కరిస్తే అంతే చాలు.

- యానాది లక్ష్మీదేవి

వేతనాలు పెంచకుంటే కార్యాలయాల ముట్టడి

●కూటమి నాయకులకు సీఐటీయూ నేత హెచ్చరిక ● ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద ఉధృతంగా అంగన్వాడీ కార్యకర్తల ఆందోళన



రాజంపేట: ధర్నాలో సీఐటీయూ నాయకుడు చిట్వేలి రవికుమార్



రైల్వే కోడూరు: నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

రాజంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కార్యకర్తల వేతనం పెంచాలని గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే అమలు చేయాలని, లేకుంటే కూటమి నాయకుల కార్యాలయాలను ముట్టడిస్తామని జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనం పెంచాలని గత ఏడాది అంగన్వాడీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 40 రోజుల పాటు ఆందోళన చేయడంతో అప్పటి ప్రభుత్వం వెయ్యి రూపాయలు వేతనం పెంచే విధంగా జీవో విడుదల చేసిందన్నారు. అప్పట్లో ఈ ఆందోళనలకు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు సంఘీభావం తెలిపా రని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైతం కుప్పంలో అంగన్వా డీ కార్యకర్తలకు సంఘీభావం తెలుపుతూ కార్యక మంలో పాల్గొన్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక విజయవాడ టీడీపీ పార్టీ కార్యా లయానికి వెళ్లి ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎవరైతే తమ నిరసనలకు సంఘీభావం తెలిపారో వారు ప్రస్తుతం తమ డిమాండ్లపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. అంగన్వాడీలకు న్యాయం జరగకపోతే కూటమి నాయకుల కార్యాలయాలు, ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ప్రాజెక్టు అంగన్వాడీ నాయకురాళ్లు ఈశ్వరమ్మ, శివరంజని, అమరావతి, రాజేశ్వరి, ఇందుమంతి, వనిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు రూరల్ : అంగన్వాడీ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేసినట్లు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు వనజ కుమారి ప్రాజెక్టు అధ్యక్షురాలు రమాదేవి సీఐటీయు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ఏడేళ్లుగా అంగన్ వాడీ వర్కర్లకు వేతనాలు పెంచలేదని సీఐటీయూ ప్రధానకార్యదర్శి రామాంజులు ఆరోపించారు లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఓబులమ్మ అధ్యక్షతన .సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 రోజుల సమ్మె సందర్భంగా పలు హామీలు గుప్పించిన కూటమి నాయకులు, వాటి అమలును ఇంతవరకు పటించు కోలేదన్నారు .కనీస వేతనం 26 వేల రూపసాయలు ఇవ్వాలని, యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు నాయకురాలు శారద, నాగవేణి, లక్ష్మీప్రసన్న, రుక్మిణి, మణి, శోభ తదితరులు పాల్గొన్నారు



లక్కిరెడ్డిపల్లె: ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కేంద్ర బడ్జెట్‌తో అగ్రగామిగా భారత్!

● రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి

రాజంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో భారత్‌ను అగ్రగామి దేశంగా నిలిపే దిశగానే బీజేపీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం రాజంపేటలోని తోట కల్యాణ మండపంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయికోలేష్, అధ్యక్షతన నిర్వహించిన మేధావుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరికం నిర్మూలన, అట్టడుగు వర్గాలు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకుల సంక్షేమమే ఈ బడ్జెట్ లక్ష్యమన్నారు. సాయిలోకేష్ మాట్లాడుతూ ఈ బడ్జెట్ దేశ రూపురేఖలనే మారుస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, టీడీపీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆడిటర్ ఎస్ఎస్ పంత్, మహిళా ఉపాధ్యాయ నేత సరిత తదితరులు ప్రసంగించారు.



సమావేశంలో ప్రసగిస్తున్న రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి

ఘనంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సిద్దవటం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జ్యోతి గ్రామంలో ఉన్న సిద్దవటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితులు జ్యోతిస్వరూప్, శరత్‌శర్మ, ఎం.ఆడివయ్య, పవన్‌కుమార్‌శర్మ, శివరామకృష్ణశర్మ, చంద్రశేఖర్ ఆరాధ్య కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాయంత్ర జపం, మహా రుద్రహోమం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భక్తులకు స్థానికులు అన్నదానం చేశారు. శ్రీశైల దేవస్థాన సహాయ కార్య నిర్వహణాధికారి సాయికుమారి. ఆలయ పర్యవేక్షకుడు నాగేశ్వరరావు, గుమస్తా సాయికుమార్, సర్పంచ్ సుబ్బమ్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

గాలివీడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మండలంలోని పూలుకుంట గ్రామం రామకృష్ణ కాలనీకి చెందిన దళితులు సోమవారం సర్పంచ్ పారసారధి రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.గత ప్రభుత్వంలో ఇండ్ల స్థలాలు కేటాయిం చిన స్థలం నివాసయోగ్యం కానిదని, సర్వే నెంబరు 434లో పాత హరిజనవాడ స్థలంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని విన్నవించారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి కూడా సమస్యను తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిట్టపల్లి వెంకట్రమణారెడ్డి, నాగేశ్వరరావు, దళిత నాయకులు లక్ష్మి నారాయణ, రమేశ్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు మంత్రి మండిపల్లి మేనల్లుడి పాదయాత్ర



లక్ష్మీప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సుండుపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి విజయం సాధించడంతో ఆయన మేనల్లుడు మౌర్యరెడ్డి సోమవారం సుండుపల్లె నుంచి తిరుమలకు తలపెట్టిన పాద యాత్రను మంత్రి సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌర్యరెడ్డి ప్రారంభించిన మహా పాద యాత్ర విజయవంతం కావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మామిడిలో కవర్ల వినియోగంపై అవగాహన

రామాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మామిడిలో కవర్ల వినియోగంపై రామాపురం ఉద్యానవనశాఖ అధికారిణి నాగమణి సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి కాయ పెద్ద నిమ్మకాయల సైజులో ఉన్నప్పుడు కవర్లు వాడటం వలన పండు ఈగ (ఊజీ), కాయతొలుచు పురుగుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. మామిడి కాయలను ఎక్కువ కాలం చెట్టుపై నిల్వ చేసి మంచి ధర వచ్చినప్పుడు అమ్మడానికి వీలు అవుతుందని వివరించారు. మామిడి కాయలకు ఎకరాలకు 4 వేల కవర్లు అవసరం ఉంటుందని, ఒక ఎకరాకు కవర్లు కట్టుకోవడానికి రైతుకు 50 శాతం సబ్సిడీతో 4వేల రూపాయలు ఉద్యానశాఖ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగమ్మ, రైతుసేవా కేంద్ర సిబ్బంది లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే మహిళలకు భద్రత

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలోనే మహిళలకు భద్రత లభిస్తుందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షురాలు వాణి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో నేరాలు జరుగుతున్నా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చూస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశాడన్నారు. ఏదో విధంగా బురద చల్లాలని వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి కుట్రలు మానుకుంటే వైసీపీ నేతలకు మంచిదని హితవు పలికారు.

తహసీల్దారు పుల్లారెడ్డి బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్లను సత్కరిస్తున్న ఉద్యోగులు

నందలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నూతన త హసీల్దారుగా వి.పుల్లారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీక రించారు. రాయచోటిలో వి. దులు నిర్వహిస్తున్న ఈయ న బదిలీపై ఇక్కడికి వచ్చా రు. ప్రస్తుతం ఉన్న తహసీల్దారు అమర్‌నాథ్ నిమ్మనపల్లెకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన పుల్లారెడ్డిని, బదిలీ అయిన తహసీల్దారు అమర్‌నాథ్‌ను స్థానిక సిబ్బంది ఘనంగా సత్కరించారు. కొత్త తహశిల్దారు తన సిబ్బందికి ప్రజల సమస్య లు తక్షణమే పరిష్కరించే విధంగా కొన్ని సూచనలు చేశారు. ఆర్ఐ జ్యోతి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ బకాసురులపై చర్యలు తీసుకోవాలి



భూమి వద్ద సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : భూ బకాసురులపై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి చింతల పూరి నాగమ్మ డిమాండ్ చేశారు. బాలిరెడ్డిపల్లి పంచాయతీ పక్కనే ఉన్న ఎర్రగుంటకోట రెవెన్యూ సర్వేనంబరు 1155లో 220 ఎకరాల భూమి ఉండగా అందులో దాదాపు 120 ఎకరాలు ఆక్రమణ కు గురయ్యాయన్నారు. అదే సర్వే నంబరులో 100 ఎకరాల భూమిని బాలిరెడ్డిపల్లె దళితులు 20 ఏళ్లుగా సాగు చేస్తుండగా కొంతమంది రాజకీయ నాయకులు ఒక్కో రైతు నుంచి రూ. 80 వేల చొప్పున దాదాపు 40 లక్షలు వసూలు చేసినట్లు పుకార్లు వినిపిస్తున్నాయన్నారు. రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమై భూ బకాసురులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భూమిని కనిపెట్టుకుని ఉన్న పేదలకు భూపంపిణీ చేయాలన్నారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ, సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలను కలుపుకొని రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

నందలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 18వ తేదీ మంగళవారం ఉదయం 10.30 నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంట ర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాధాకృష్ణ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరు తప్పకుండా హాజరు కావాలని ఆయన సూచించారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక మండల ప్రజా పరిషత్ కారాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. 18వ తేదీన దిన్నేపాడు, దప్పేపల్లె, పందిళ్లపల్లె, మద్దిరేవుల, కోనంపేట, కాకుళవరం, కుర్నూతల అప్పకొండయ్యగారిపల్లెకు చెందిన అభ్యర్థులు, 19 న లక్కిరెడ్డిపల్లె, అనంతపురం, బి ఎర్రగుడి, పాళెంగొల్లపల్లె గ్రామస్తులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

సిద్దవటం: వివిధ కార్పొరేషన్లు మంజూరు చేసే రుణాలకు ఈ నెల 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు సిద్దవటం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఫణిరాజ కుమారి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తుతో పాటు, ఇతర ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లె మండల కార్యాలయంలో బుధవారం 19న ఉదయం 10.30 గంటలకు బీసీ కార్పొరేషన్ రుణాలకి సంబంధించి బ్యాంకు మేనేజర్లు, అధికారుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో మల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారు తమ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు తప్పక హాజరు కావాలని తెలియజేశారు.

కరువులో రైతుకు ఆసరా 'పాడి'


హరియాణా నుంచి తెచ్చిన గేదెలు

- డెయిరీతో ఆర్థిక ఆదాయం
- కష్టపడితే ఫలితం ఉందంటున్నరైతు

సంబేపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం జూదంలా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో రైతులను పాడి పరిశ్రమ ఆదుకుంటోంది. రైతులు పంటలు సాగు చేయడం ప్రకృతి విపత్తులతో నష్టపోవడం సహజంగా జరుగుతోంది. దీంతో రైతు పాడి పరిశ్రమ వైపు దృష్టి సారించారు. ఒకప్పుడు ఇంటిలో ఒకటి, రెండు లోపు పాడి ఆవులు, గేదెలు పెంచేవారు. వీటితో కుటుంబ అవసరానికి సరిపడే పాలు, పెరుగు వచ్చేది. ప్రస్తుతం మార్కెట్‌లో పాల దిగుబడులకు మంచి గిరాకీ ఏర్పడడంతో రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. ఈ తరుణంలో పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకుని పాలు అమ్ముతూ ప్రతి నెలా ఆర్థికంగా సంపాదించడం విశేషం. కరువు పరిస్థితుల నుంచి ప్రస్తుతం పాడి పరిశ్రమ రైతులను ఆదుకుంటోంది. ఇందుకు నిదర్శనం రైతు సహదేవరెడ్డి. ఊరు సంబేపల్లె మండలం ప్రకాశ్‌నగర్‌కాలనీ గుండ్రేవాండ్లపల్లె. 30 గేదెలను హరియాణా రాష్ట్ర జింద్ ప్రాంతం నుంచి తెచ్చారు. వీటిలో 20 నుంచి 25 పాడి గేదెలు పాలు ఇస్తున్నాయి. ప్రతిపూట 100 లీటర్ల చొప్పున రోజుకు రెండు పూటలా 200 లీటర్లు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఒక లీటర్ ధర 70 నుంచి 80 రూపాయలు ఉండడంతో నెలకు సుమారు నాలుగు లక్షల రూపాయలు ఆదాయం వస్తున్నట్లు చెబుతున్నాడు. దీంట్లో 50 శాతం ఖర్చు పోయినా కష్టపడితే మంచి ఆదాయం వస్తుందంటున్నారు రైతు.


గేదెల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు


పశుగ్రాసాన్ని ముక్కలుగా కోసే మిషన్

మేలు రకపు గేదెల ఎంపిక

రైతులు అధిక పాలు దిగుబడి ఇచ్చే పాడి గేదెలను ఎంపిక చేసుకోవాలి. ఒక్కో పూట గేదె ఎనిమిది నుంచి పది లీటర్ల పాల దిగుబడి వచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి. రైతు హర్యానా రాష్ట్రం జింద్ ప్రాంతంలో గేదెలను ఎంపిక చేసుకుని 30 గేదెలను కొనుగోలు చేశారు. వీటికోసం మూడు రేకుల షెడ్‌లను నిర్మించారు. ఒక్కొక్కటి సుమారు 7 లక్షల రూపాయలు ఖర్చు చేసి మూడు రేకుల షెడ్లు నిర్మించుకున్నట్లు తెలియజేశారు. గేదెను పట్టి లక్ష పది వేల నుంచి సరాసరి రూ.1.50 లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసినట్లు తెలిపారు. హర్యానా నుంచి రావడానికి 10 గేదెలకు సుమారు లక్షన్నర రూపాయలు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను భరించినట్లు తెలియజేశారు. రైతు ఆశించిన పాల దిగుబడి రాకపోతే నష్టాలు వస్తాయని తెలియజేశారు.

వ్యవసాయం గిట్టుబాటు కాలేదు

వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. పెట్టుబడులు పెరిగిపోయాయి. పంట దిగుబడులు సక్రమంగా రాలేదు. దీంతో పాడిని ఎంచుకున్న పాల దిగుబడితో మంచి ఆదాయం వస్తోంది. పలువురికి ఉపాధి కల్పించడం సంతోషంగా ఉంది. కష్టపడి పనిచేస్తే పాడి పరిశ్రమలో మంచి ఆదాయం పొందవచ్చు.

- సహదేవరెడ్డి, రైతు, గుండ్రేవాండ్లపల్లె

పశువులకు వినియోగించే దాణా రకాలు

పాల దిగుబడి పెరగాలంటే వాటికిచ్చే పశుగ్రాస గడ్డితో పాటు దాణాకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నారు రైతు. ఈ గీతల కోసం పత్తి చెక్క, మొక్కజొన్న, పొట్టు అలసంద, గోధుమపిండి, గోధుమ పొట్టు రకాలతో పాటు అమెరికల్ బుల్లెట్ రకం గడ్డిని కూడా తెలిపారు. గేదెలకు సరిపడే గడ్డి వేస్తున్నట్లు రైతు తెలిపారు.


గేదెలకు వాడుతున్న దాణా


సాగులో ఉన్న అమెరికన్ బుల్లెట్ రకం గడ్డి

బినామీ పేరుతో పోలీసు అధికారి భూకబ్జా

- సబ్‌కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు


పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వారసత్వంగా తమకు వచ్చిన భూమిని ఓ పోలీసు అధికారి బినామి పేరుతో ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కురబలకోట మండలానికి చెందిన నరసింహులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. తమ తాతల నుంచి సంక్రమించిన భూమిని మదనపల్లెలో పనిచేసిన పోలీసు అధికారి బినామి పేరుతో ఆక్రమించి, బెదిరిస్తున్నాడని కురబలకోట మండలం ఎర్రబల్లి పంచాయతీ కంటేవారిపల్లెకు చెందిన రైతు నరసింహులు ఫిర్యాదు చేశాడు. తమ పొలాలకు దారి లేకుండా ఓ మాజీ ప్రజాప్రతినిధి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మదనపల్లె మండలం పొన్నేటిపాలెం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ ఆముదాలకాలువ గ్రామంలో బోరు ఎండిపోయిందని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు విన్నవించారు. ఇలా డివిజన్‌లోని 11 మండలాల నుంచి 48 మంది సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందించగా, ఆయా మండలాల అధికారులు సకాలంలో సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు


ముద్దాయి షేక్ ఇలియాజ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళలపై కిరోసిన్ పోసి నిప్పంటించడానికి ప్రయత్నించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ సోమవారం రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన తీర్పు ఇచ్చారు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని కొత్తపల్లె మహబూబ్ నగర్‌కు చెందిన షేక్ ఇలియాజ్ 2022 జూన్ 1వ తేదీ రాత్రి 9.30 గంటలకు ఇంటి బయట కూర్చుని ఉన్న మహబూబ్‌జాన్ అనే మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నిస్తుండగా, ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడికి చేరుకున్నారు. దీంతో నిందితుడు పారిపోగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు రాయచోటి అర్బన్ ఎస్ఐ మహమ్మద్‌రఫీ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితుడికి పై మేరకు శిక్ష విధిస్తూ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన తీర్పు ఇచ్చారు.

మద్యం విక్రేత అరెస్ట్


పోలీసులకు పట్టుబడిన రామయ్య, మద్యం సీసాలు

సిద్దవటం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీ నిర్మలగిరి కాలనీలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో కుంభగిరి రామయ్య(50) ఇంట్లోని ఓ బ్యాగులో 10 మద్యం సీసాలు పట్టుబడడంతో, స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. స్థానిక పోలీసులు శివప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేయడానికి వెళితే దుర్భాషలాడాడు

- సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులుపై ఎస్పీకి ఫిర్యాదు



మీడియా ఎదుట కన్నీటి పర్యంతమవుతూ తన గోడును విన్నవిస్తున్న బాధితురాలు చంద్రకళ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ స్థలంలో పునాది వేస్తుంటే కొంత మంది రౌడీలు దౌర్జన్యం చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయడానికి సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు దగ్గరకు వెళితే ముందు బయటకు వెళ్లండి లేకుంటే బూటుకాళ్లతో తంతానంటూ దుర్భాషలాడాడని సుండుపల్లె మండలం రాయవరం గ్రామం మిట్టమీదపల్లెకు చెందిన రామాంజులు భార్య మడితాడు చంద్రకళ సోమవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు ఎస్పీ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ తమ సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి పునాది వేస్తుంటే రాయవరం కస్బాకు చెందిన రౌడీలు భద్రి రమేశ్, మడితాడు బాబు, పవన్‌కుమార్, సాయికుమార్, ప్రవీణ్‌లతో పాటు మరో ముగ్గురు వచ్చి దౌర్జన్యం చేయడమే కాకుండా దాడికి ప్రయత్నించారని తెలిపారు. ఈ విషయంపై సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఎస్ఐ శ్రీనివాసులు మా దగ్గరకి ఎందుకు వచ్చారు. నేను ముందే చెప్పాను కదా వాళ్లు చంపేస్తారని, నువ్వు పోలీస్‌స్టేషన్ నుంచి బయటికి వెళ్లిపో లేదంటే బూటుకాళ్లతో తంతాను అని దుర్భాషలాడడమే కాకుండా ఫిర్యాదు తీసుకోకపోవడంతో చంద్రకళ రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌కు ఫిర్యాదు చేసేందుకు రాయచోటికి వెళుతుండగా రాయచోటి రోడ్డు మార్గంలో అనుంపల్లి సమీపంలో ఆ రౌడీలు భద్రి, ప్రవీణ్ మరికొంత మందిని మా వెంట పడడమే కాకుండా ద్విచక్ర వాహనంలో వస్తున్న మమ్మల్ని చేజింగ్ చేసి గొడ్డళ్లు, రాళ్లతో వెంటబడి హత్యా ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. నాకు ఆ రౌడీల నుంచి ప్రాణహాని ఉందని, న్యాయం చేయాలంటూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశామని మడితాడు చంద్రకళ తెలియజేశారు.

మా భూమిని మాకు ఇప్పించండి!

- 26 సెంట్లు కొనుగోలు చేసి 26 ఎకరాలు ఆక్రమించుకున్నారు
- రికార్డులు లేకుండానే వారికి పాసుబుక్కులు ఇచ్చేశారు
- రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా రెవెన్యూ అధికారులు
- పీలేరులో అర్చకుడు ఆనంద శర్మ ఆరోపణ


వివరాలు తెలుపుతున్న అర్చకుడు ఆనంద శర్మ

పీలేరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎటువంటి విక్రయ దస్తావేజులు లేకుండానే కొంత మంది ఆక్రమణదారులు తమ పూర్వీకుల ఆస్తిని కాజేశారని, వారి చెరలో ఉన్న తమ భూమిని తమకు తిరిగి ఇప్పించాలని పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ శివ రామాపురానికి చెందిన అర్చకులు ఆనంద శర్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీలేరులో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తన తాత అయిన గర్నిపూడి రామయ్యకు దొడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో 26 ఎకరాల భూమి ఉండేదన్నారు. 1926లో అప్పటి చిత్తూరు జిల్లా బోర్డు సభ్యుడు అయిన ఊసు పాపిరెడ్డి విజ్ఞప్తి మేరకు పీలేరు-మదనపల్లె మార్గంలోని బడబళ్లవంకపై వంతెన నిర్మించేందుకు 26 సెంట్ల భూమిని విక్రయించారన్నారు. అయితే తదనంతర కాలంలో ఊసు పాపిరెడ్డి వారసులు ఆ 26 సెంట్లను ఏకంగా 26 ఎకరాలుగా మార్చి, నకిలీ దస్తావేజులు సృష్టించి తమ భూములను ఆక్రమించుకున్నారన్నారు. వాటిపై 2014 నుంచి 2022 సంవత్సరాల కాలంలో పలుదఫాలుగా వారికి పాసుపుస్తకాలను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారన్నారు. ఆక్రమణదారుల వద్ద ఎటువంటి కొనుగోలు దస్తావేజులు లేకపోయినా నోషనల్ ఖాతాల ద్వారా పాసుపుస్తకాలు అందజేశారన్నారు. నోషనల్ ఖాతాల ద్వారా పాసుపుస్తకాలు మంజూరు చేయరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. సుదీర్ఘ పోరాటం చేసినప్పటికీ లాభం లేకపోవడంతో తాను మదనపల్లెలో జరిగిన రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాకు వినతి పత్రం అందజేశానన్నారు. అంతే కాకుండా ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లోనూ వినతి పత్రం అందించానన్నారు. ఆ వినతి పత్రం విచారణ కోసం పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు ఆదివారం క్షేత్రస్థాయి పర్యటకు వచ్చారన్నారు. ఆయన రికార్డులు పరిశీలించకుండానే భూమి ఎవరి అనుభవంలో ఉంటే వారికే చెందుతుందని సమాధానం చెప్పారని వాపోయారు. పేద బ్రాహ్మణులైన తాము స్థానికంగా జీవనాధారం లేకపోవడంతో అర్చకత్వం వృత్తిగా స్వీకరించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జీవనం సాగించామన్నారు. ఆ భూములను గతంలో తాము పలుమార్లు కౌలుకు ఇద్దామని ప్రయత్నించినప్పటికీ ఆక్రమణదారులు అడ్డుకున్నారన్నారు. ఆ విషయాలన్నింటినీ తాను తహసీల్దారుకు విన్నవించినా ఆయన పట్టించుకోలేదన్నారు. తన వినతి పత్రంపై విచారణను వీలైనంత త్వరగా ముగించేయాలన్న తొందరలో ఉన్నారన్నారు. తనకు న్యాయం చేయాలని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం చేయాలని, న్యాయం జరగని పక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రెవెన్యూ ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామన్నారు.

జీవోలను అమలు చేయండి

- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్


రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మినిట్స్ కాపీలో ఇచ్చిన జీవోలను వెంటనే అమలు చేయాలంటూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాయచోటి ప్రాజెక్టు కార్యదర్శి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు ధర్నా చేశారు. రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టులోని అధికారులు సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. దిగువరాజుగారిపల్లె హెల్పర్ రెండేళ్ల నుంచి విధులకు రాకపోయినా ఆమె పైన చర్యలు తీసుకోకపోవడానికి అధికారులకు ఆ హెల్పర్స్‌కు మధ్య ఉన్న మతలబు ఏంటని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బంగారుపాప, యూనియన్ లీడర్లు అరుణ, విజయ, షబీనా, సుమలత, సురేశ, పద్మజ, శంకరమ్మ, పద్మజ, జయమ్మ, లక్ష్మీదేవి, షబాణా, శైలజ, అంజలి, శ్రీదేవి, కళ తదితర వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తబస్సులు ప్రారంభం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):మదనపల్లె వన్ డిపోకు చెందిన కొత్తబస్సులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిపోలకు 25 నూతన బస్సులు రానున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. మదనపల్లె వన్ డిపో నుంచి బళ్లారి, హైదరాబాదు, తిరుపతి టూడిపో నుంచి విజయవాడ, తిరుపతిలకు కొత్తబస్సులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎంలు మూరే వెంకటరమనారెడ్డి, అమరన్నాథ్, ఆర్టీసీ యూనియన్ నాయకులు, టీడీపీ నాయకులు గుత్తికొండ త్యాగరాజ, జేసీబీ మధు, గురునాథ్, జాన్‌బాబు, జేసీబీ వేణు, మోహన, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సిద్దవటం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పొట్టేళ్ల కొనుగోలు చేసి, డబ్బు ఇవ్వకుండా మోసం చేసిన ఇద్దరిపై సిద్దవటం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కాజిపల్లెకు భాస్కర్‌రెడ్డికి చెందిన 7 పొట్టేళ్లను గత ఏడాది జూలైలో కడప నగరానికి చెందిన సుబ్బారెడ్డి, బాషా రూ. లక్ష రూపాయలకు కొనుగోలు చేశారు. పది రోజుల్లో డబ్బు చెల్లిస్తామని చెప్పి మోసం చేశారంటే ఫిబ్రవరి 12న కడప ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేసిన పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ప్రసాద్

నందలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు బస్టాండు కూడలిలో సోమవారం సాయంత్రం బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. మాధవరం నుంచి తాళ్లపాకకు బైకుపై వెళుతున్న కమ్మినేని ప్రసాద్, శ్రీకళ దంపతులను కడప నుంచి రాజంపేటకు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన దంపతులను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కడప జిల్లాకు రానున్న 20 సూత్రాల చైర్మన్ రాక

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర 20వ సూత్రాల చైర్మన్ లంక దినకర్ ఈనెల 18వతేదీ మంగళవారం కడపకు రానున్నారు. 17వ తేదీ రాత్రి 8-05 గంటలకు విజయవాడ నుంచి రైలులో బయలుదేరి 18న ఉదయం 7-30 గంటలకు కడప స్టేట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 10-30 గంటల నుంచి కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లా రివ్యూ మీటింగ్‌ను 2 గంటల వరకు నిర్వహిస్తారు. అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహిస్తారు. సాయంత్రం 5-30 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రికి శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి చేరుకుని అక్కడే బస చేస్తారు.

రూ.10కోట్ల స్థలంలో పార్కు



నిరుపయోగంగా ఉన్న వైఎస్ఆర్ పార్కు



చెట్ల కింద బండలను పగలగొట్టిన దృశ్యం



పార్కులో పడేసిన మద్యం బాటిళ్లు

- అలనా పాలనలేక నిరుపయోగం
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల పట్టణ నడిబొడ్డన దాదాపు రూ.10కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన పార్కు ఆలనా పాలన లేక నిరుపయోగంగా మారింది. గతంలో ఈ పార్కు ప్రాంతంలో ఆర్అండ్‌బీ అతిథి గృహం ఉండేది. దివంగత మంత్రి వీరారెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన ఈ అతిథి గృహాన్ని అప్పట్లో అధికారులకు, మంత్రులకు విడిదిల్లుగా ఉపయోగించేవారు. అలాగే ప్రభుత్వ బహిరంగసభలకు, డ్వాక్రా మహిళల సమావేశాలకు ఉపయోకరంగా ఉండేది. కాలక్రమంలో అతిథిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చొరవ తీసుకుని వైఎస్ఆర్ పార్కును ఏర్పాటు చేశారు.

పోరుమామిళ్ల పట్టణ ప్రజలకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండే విధంగా సుమారు రూ.25లక్షల వ్యయంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్కు నిర్మించారు. అప్పట్లో పట్టణవాసులు తమ కుటుంబ సభ్యులతో ఇక్కడ సేదదీరేవారు. చిన్నారుల కోసం జారుడుబండ, ఉయ్యాల ఏర్పాటు చేశారు. అటువంటి పార్కు నిర్వహణ లేని కారణంగా అధ్వానంగా తయారై నేడు మందుబాబులకు నిలయంగా మారింది. పార్కులో ఎక్కడ పడితే అక్కడ మందుబాబులు తాగి పడేసిన మద్యం బాటిళ్లు దర్శన మిస్తున్నాయి. ఇక పార్కులో చెట్ల చుట్టూ సేదదీరేందుకు గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసిన అరుగులను ఆకతాయిలు ధ్వంసం చేశారు. ఎవరైనా జోక్యం చేసుకుని మందలిస్తే వారిపై ఎదురు తిరిగిన సంఘటనలు ఉన్నాయి. రూ.కోట్లు విలువైన ఈ స్థలంలో ప్రజల కోసం పార్కు ఏర్పాటు చేస్తే అది ఇప్పుడు నిరుపయోగంగా మారింది. దీనిపై దృష్టి పెట్టకపోతే అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే అవకాశాలున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాయకులు చొరవ తీసుకుని పార్కును పునరుద్ధ రించి అందరికీ ఉపయోగపడే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పోరుమామిళ్ల పంచాయతీ అధికారి రవిశంకరరెడ్డిని వివరణ కోరగా... ఆ పార్కును ఇంత వరకు ఎవరూ తమకు స్వాధీనం చేయలేదన్నారు.

శ్మశానం ఉన్నా ఇళ్ల మధ్యనే శవాన్ని పూడ్చివేయడం దారుణం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



ఇళ్ల మధ్యలో శవాన్ని పూడ్చివేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట గ్రామస్థులకు శ్మశాన వాటిక ఉన్నా పేదల గుడిసెల మధ్యనే శవాన్ని పూడ్చివేయడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. సోమవారం భాకరాపేట సమీపంలోని సీపీఐ కాలనీలో ఆదివారం భాకరాపేట గ్రామస్థులు శవాన్ని పూడ్చివేసిన స్థలాన్ని, కాలనీకి సమీపంలో ఉన్న భాకరాపేట శ్మశాన వాటికను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శ్మశాన వాటికలకు ఎప్పుడూ తమ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. అయితే భాకరాపేట గ్రామస్థులను కొందరు భూ ఆక్రమణదారులు రెచ్చగొట్టి తమ స్వలాభం కోసం పేదల కాలనీలో ఇళ్ల మధ్యనే శవాన్ని పూడ్చిపెట్టేందుకు వచ్చారన్నారు. ఇందుకు సీపీఐ నాయకులు నిర్మాణాలున్న చోట కాకుండా కాస్త దూరంలో అంత్యక్రియలు జరపాలని అభ్యర్థించినా వారు మాట వినలేదని.. ఇందులో భూఆక్రమణదారుల కుట్ర ఉందన్నారు. భాకరాపేట గ్రామస్థులను ప్రేరేపించిన భూ ఆక్రమణదారుల బాగోతం త్వరలోనే సీపీఐ బయటపెట్టి తగిన గుణపాఠం చెబుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, బాలు, డీహెచ్‌పీఎస్ నాయకులు పడిగ వెంకట్రమణ, సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మూగజీవాలకు పశువైద్య విద్యార్థుల గోడు



వైద్యం కోసం వచ్చిన మూగజీవానికి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా ఉపకార వేతనాలు పెంచాలని గత 15 రోజులుగా పశువైద్య కళాశాల విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మెబాటపై ఎలాంటి స్పందన లభించలేదు. దీంతో తమ సమ్మెలో భాగంగా సోమవారం పశువైద్య కళాశాలకు వైద్యం కోసం తీసుకువచ్చిన మూగజీవాలకు తమ న్యాయపరమైన కోర్కెలతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చి గోడును వెలుబుచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు శివతరుణ్ మాట్లాడుతూ గత 15 రోజులుగా స్టైపండ్ పెంచాలన్న డిమాండ్‌తో అధికారులు, రాజకీయ నాయకులకు విన్నవించుకున్నా ఏ ఒక్కరూ స్పందించి తమకు న్యాయం చేయలేదని వాపోయారు. కనీసం మూగజీవాలకు అయినా తాము పడుతున్న బాధలు అర్థమవుతాయన్న భావనతో వినతి పత్రం అందించి నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. తదనంతరం కళాశాల ఆవరణలో సమ్మెనుకొనసాగించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి





ప్రమాద స్థలిలో సుబ్బయ్య మృతదేహం, సుబ్బయ్య (ఫైల్)

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి జాతీయ రహదారి గొల్లపల్లె గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కంబాల సుబ్బయ్య (45) మృతి చెందినట్లు ఎస్ఐ ప్రతా‌ప్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. దేవునికడపకు చెందిన కంబాల సుబ్బయ్య తాడిపత్రి ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున కడప నుంచి ఎర్రగుంట్ల వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గొల్లపల్లె సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శిరీషా, ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ తరలించి... కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

చెన్నూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రభారతిపేటలో మంగపట్నం మధుసూదన్ (43) అనే వ్యక్తి సోమవారం ఉదయం ఉరి వేసుకుని మృతి చెందాడు. కార్పెంటరుగా పనిచేసి జీవనం సాగించే మధుసూదన్ తల్లి వెంకట సుబ్బమ్మ ఆదివారం మృతి చెందింది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతునికి మానసిక వికలాంగుడైన ఓ అన్న ఉన్నాడని, తమ్ముని మరణంతో అతడు అనాథగా మిగిలాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మధుసూదన్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విషద్రావణం తాగి వ్యక్తి మృతి

సికెదిన్నె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరుకు చెందిన శీలం సుబ్బరాయుడు అనే వ్యక్తి విషద్రావణం తాగి మృతి చెందాడు. సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. సుబ్బరాయుడు తన మొదటి భార్య కుమార్తె పుష్పలతను ప్రొద్దుటూరు ఖాదర్‌బాద్‌కు చెందిన కురాక్ వెంకటసుబ్బయ్యకు ఇచ్చి వివాహం జరిపించాడు. వారికి ఒక కుమార్తె సంతానం. అయితే గత కొంత కాలంగా పుష్పలత వేరే వ్యక్తితో చనువుగా ఉంటూ అతనితో కలిసి వెళ్లిపోయింది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ చేసినప్పటికి ఆమె అతనితోనే ఉంటానని చెప్పడంతో పరువు పోతుందని భావించి కలత చెందాడు. దీంతో జీవితంపై విరక్తితో ఆదివారం రాత్రి విషద్రావణం తాగాడు. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలోని రిమ్స్ పీఎస్ పరిధిలో నాగముని (45) అనే మహిళ సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. నాగముని తన తండ్రి ప్రసాద్ వద్ద ఉంటూ టిఫిన్ సెంటరు పెట్టుకుని జీవనం సాగించేవారు. అయితే తన తల్లి చిన్న చిన్న సమస్యలకు కూడా మానసికంగా బాధపడేదని.. ఈ నేపథ్యంలో క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుమారుడు దీపక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిరుతపులివి కాదు.. కుక్క జాతి జంతువు అడుగులు

- ముద్దనూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వెల్లడి



రైతులతో మాట్లాడుతున్న డీఆర్ఓ శ్రీనివాసులు

లింగాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): లింగాలలో ఆదివారం వాసుదేవరెడ్డి పొలంలో గమనించిన అడుగులు చిరుతపులివి కాదని ముద్దనూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన లింగాలలోని వాసుదేవరెడ్డి పొలంలోని అడుగులను పరిశీలించారు. ఇవి కుక్కజాతి జంతువు అడుగులని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. కానీ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనంతరం లింగాల తహసీల్దార్ ఈశ్వరయ్యను కలిసి సంఘటనకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. అలాగే అడవి జంతువుల నుంచి ఏ విధంగా రక్షించుకోవాలో తెలియజేసే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ గోపాలకృష్ణ, మహబూబ్ బాష పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- గోడ పత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్ శ్రీధర్



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, విద్యుత్ అధికారులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో విద్యుత్ ప్రమాదాలను అరికట్టడంలో సూచనలపై వీడియో, ఆడియో, పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేబుల్ నెట్ వర్క్ టీవీల ద్వారా, ప్రొజెక్టర్ల ద్వారా విద్యుత్ భద్రత నియమాలపై వీడియో ప్రదర్శిస్తే అర్థం చేసుకోవడానికి సులభంగా ఉంటుందన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచగలిగితే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఇంటికీ విధిగా ఎర్తింగ్ ప్రమాణాలు కలిగిన విద్యుత్ పరికరాలను, ముఖ్యంగా వ్యవసాయ బోర్ల వద్ద భద్రత నియమాలు విధిగా పాటించాలన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన విద్యుత్ ప్రమాదాలు తీవ్ర దుఃఖాన్ని కలిగించాయన్నారు. ప్రాణం చాలా విలువైనదని... ఇంటి పెద్దను కోల్పోతే ఆ కుటుంబసభ్యులు పడే వేదన, ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపతాయన్నారు. విద్యుత్ భద్రతా నియమాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీసీఈఓ ఓబుల మ్మ, విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీరు రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మధుసూదన్, హుస్సేన్ బాషా, మధుసూదన్‌రెడ్డి, నీరజ, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలి

- గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులను అడ్డుకున్నరైతులు ● రోడ్డుపై బైఠాయించి నిరసన



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు జాతీయ రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అనంతరం రోడ్డు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వివరాలిలా.. మండలంలోని మల్లేపల్లె గ్రామానికి చెందిన రైతులు బెంగుళూరు-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్నారు. దాదాపు 130 ఎకరాలకు 150 మంది రైతుల వద్ద నుంచి ప్రభుత్వ వాల్యు యేషను ప్రకారం ఎకరాకు రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని ఒప్పంద పత్రాలు తీసుకున్నారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూములతో జీవనం సాగిస్తున్నామని... ఈ భూములను కోల్పోతే తమకు ప్రత్యామ్నాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారుల పనుల జరిగే ప్రాంతంలో రైతన్నలు ఆందోళనకు దిగారు. ఉదయం 7గంటల నుంచి పనులు జరగకుండా వాహనాలను అడ్డగించి రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేపల్లె గ్రామ సర్పంచ్ భర్త, మాజీ డీసీసీ చైర్మన్ చిలమల నారాయణ, పలువురు రైతులు మాట్లాడుతూ ఉన్నఫలంగా మా భూములను రోడ్డు పనులకు లాక్కున్నారని... ఇప్పుడు మేం ఎలా జీవనం సాగించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.50లక్ష ల చొప్పున భూములు కోల్పోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈవిషయం తెలిసిన తహసీల్దారు దామోదర్ రెడ్డి అక్కడకు రావడంతో భూములు కోల్పోయిన రైతులు తమ ఆవేదనను వినతిపత్రం రూపంలో అందజేశారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిలమల లక్ష్మిదేవి, టీడీపీ నేత చిలమల నారాయణ, నాగయ్య, రైతన్నలు జయ రామిరెడ్డి, సత్యనారాయణ, నరసింహయ్య యాదవ్, రామ సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ లలిత



డాక్టర్ లలితకు నియామకపత్రం అందిస్తున్న వీసీ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.లలితను స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. డాక్టర్ లలితకు నియామకపు పత్రాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ అందజేశారు. ప్రతినెల 3వ శనివారం వైవీయూలో స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం అమలును పర్యవేక్షించడం, నివేదించడం వంటి బాధ్యతలను చూస్తారు. కార్యక్రమంలో ప్రభుత్వం జారీ చేసిన కార్యాచరణ మార్గదర్శకాలను అమలయ్యేలా పర్యవేక్షిస్తారు. కార్యక్రమంలో ఫిజిక్స్‌శాఖ సహ ఆచార్యులు డాక్టర్ వెంకటరామ్ పాల్గొన్నారు.

తలనీలాల వేలం వాయిదా



వేలం నిర్వహిస్తున్న అధికారులు

చక్రాయపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో భక్తులు సమర్పించే తలనీలాల కోసం వేలం నిర్వహించగా గుత్తేదారులు ఒకరే రావడంతో సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సోమవారం భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరిచిప్పలకు వేలం నిర్వహించారు. మొదటి పర్యాయం కూడా వాయిదా పడింది. రెండో పర్యాయం గుత్తేదారులు రాక వాయిదా పడింది. కొబ్బరిచిప్పలకు నలుగురు గుత్తేదారులు వచ్చినా సరైన ధర రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, బ్యాంకు అధికారులు, జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సహకారంతోనే యుడైస్ విజయవంతం : డీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష, ఎమ్మార్సీ సిబ్బంది సహకారంతో యుడైస్ విజయవంతమైందని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరం సీఎస్ఐ హైస్కూల్లో యుడైస్‌పై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మండల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష ఎమ్మార్సీ సిబ్బందిలో భాగమైన మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, సీఆర్పీ (సీఆర్ఎంటీ)ల సహకారంతోనే యుడైస్‌లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. పని ఒత్తిడి ఉన్నప్పటికీ ఎంతో ఓర్పుతో తక్షణ సమాచారం ఎప్పుడు అడిగినా మండల విద్యాశాఖాధికారులు పంపుతుండడం అభినందనీయమన్నారు. ఇలా అందరి సహకారంతో విద్యాశాఖలో జిల్లా దాదాపు అన్నింటా ముందు ఉందన్నారు. నమోదయ్యే ప్రతి పాఠశాల సమగ్ర సమాచారంతోనే పాఠశాలల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుదని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.నిత్యానంద రాజులు పేర్కొన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష సెక్టోరాల్ అధికారులు వీరేంద్ర, దశరథరామిరెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల (స్కూల్ అసిస్టెంట్) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.నిత్యానందరాజు పేర్కొన్నారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు 19 నుంచి 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష కార్యాలయం, ఎన్జీఓ కాలనీ, కడపలో సమర్పించాలని తెలిపారు. పూర్తిసమాచారం వివరాల కోసం సమగ్ర శిక్ష కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జీపీఆర్ఎస్ ఫిర్యాదు వెంటనే పరిష్కరించాలని మదనపల్లె తహసీల్దార్ ధనంజయులు అన్నారు. తహసీల్దార్ కార్యాల యానికి సోమవారం వచ్చిన రైతులవద్ద అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, ఆర్ఐ శేషాద్రిరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బదిలీ అయిన డీటీకి ఘనసన్మానం

పీలేరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన డిప్యూటీ తహసీల్దారు రెడ్డప్ప రెడ్డిని సోమవారం పీలేరు రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దారు భీమేశ్వర రావు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సమగ్ర సర్వే డీటీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రేపు బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

కలికిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భానుమూర్తి రావు తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడాకు 15 యూనిట్లు, యూనియన్ బ్యాంకుకు 16, కలికిరి సప్తగిరి గ్రామీణ బ్యాంకుకు 17, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 15, మహల్ సప్తగిరి బ్యాంకుకు 14 యూనిట్లు వంతు మొత్తం మండలానికి 77 యూనిట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. మొత్తం మీద 547 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని వారందరికీ ఆయా బ్యాంకు మేనేజర్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తులతోపాటు దానికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకురావాలని ఎంపీడీవో కోరారు.

నిమ్మనపల్లిలో: బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఈనెల 19 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బీసీ కార్పొరేషన్ కింద 50శాతం సబ్సిడీతో 45యూనిట్లు మంజూరయ్యాన్నారు. దరఖాస్తుదారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 10:30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో ఈ నెల 19న స్వయం ఉపాధి కార్పొరేషన్ రుణాల మంజూరుకు స్థానిక నగరపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషనర్ జీవీ పల్లవి పేర్కొన్నారు. అభ్యర్థులందరూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు.

తంబళ్లపల్లెలో: చంద్రన్న స్వయం ఉపాధి పథకం-ఓబీఎంఎంఎస్ బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే ప్రభుత్వ సబ్సిడీ రుణాలకు ఈ నెల 19న ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె మండలానికి 51 యూనిట్లు మంజూర్వగా, మొత్తం 175 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

కలకడలో:కలకడ మండలంలో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకొన్న లబ్ధిదారులకు ఈనెల 19వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయని ఎంపీడీవో అబ్దుల్ రహీం తెలిపారు. లబ్ధిదారులు బుధవారం ఉదయం 10 గం టలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు జరుగునున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యార్హతలు, కులం, ఆదాయం సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

పెద్దతిప్పసముద్రంలో: వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 19న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని వివిధ రకాల కార్పొరేషన్ల ద్వారా మొత్తం 40 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

నేడు రుణాలకు ఇంటర్వ్యూలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకొన్న లబ్ధిదారులు మంగళవారం ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీవో వెంకటేశులు పేర్కొన్నారు. ఇందులో గ్రామీణ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌కు సంబంధించిన లబ్ధిదారులకు ఉదయం 10 గంటల నుంచి తరిగొండ గ్రామీణ బ్యాంక్ పరిధిలోని లబ్ధిదారులకు మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. .

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ అసోసియేషన్ సభ్యులు



తంబళ్లపల్లెలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు



వాల్మీకిపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. గత ఐదేళ్లుగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని దీనిపై 42 రోజులు సమ్మె నిర్వహిస్తే అప్పటి ప్రభుత్వం అంగీకరించినా, ప్రభుత్వాలు మారినా తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్రంలోని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్ రూపొందించి అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాలు మధురవాణి, సీఐటీయూ నేత హరీంద్రనాథ్‌శర్మ, పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ మహిళా కార్యకర్తలు సోమవారం స్థానిక ప్రాజెక్టుట కార్యాలయం ఎదుట ధర్నా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కనీస సమస్యలను ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని గ్రాట్యుటీ అమలు చేయాలని, రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లలో మార్పు చేస్తూ తక్షణం జీవో ఇవ్వాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, టీఏ బిల్లులు వెంటనే ఇవ్వాలని అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా మార్చు, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ, ఉచితంగా గ్యాస్ సరఫరా తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా ఈకేవైసీని తిరస్కరిస్తున్నామని తాము ఎవరూ చేయబోమన్నారు. అనంతరం సీడీపీవో భారతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకిపురం ప్రాజెక్టు సీఐటీయూ అధ్యక్షురాలు చంద్రావతి, యూనియన్ సభ్యులు భూకైలేశ్వరి, గులాబ్‌జాన్, పార్వతి, పద్మశ్రీ, నరసమ్మ, అమ్మాజీ, వివిధ మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటుగా గ్రాట్యూటీ అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో ఉన్న మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ జీవో ఇవ్వాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలన్నారు. సాధికార సర్వేలో అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు అన్న పదం తొలగించి, సంక్షేమ పథకాలను అమలుచేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఓబుల్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు గౌరి, కరుణశ్రీ, సులోచన, స్వరూపారాణి, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా చేశారు. ప్రాజెక్ట్ పరిధిలోని ములకలచెరువు, పీటీయం, బి.కొత్తకోట మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు సీడీపీవో కార్యాయం ఎదుట బైఠాయించి వేతనాలు పెంచాలని, గ్యాడ్యుటీ అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ లీడర్లు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం 42రోజుల పాటు సమ్మె చేశామని అప్పట్లో 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చినా అమలు కాలేదన్నారు. అధికారంలోకి కాగానే అంగన్‌వాడీల సమస్యలు తీర్చుతామని హామీఇచ్చిన టీడీపీ నాయకులు తమహామీని నిలుపుకోవాలన్నారు. ఆమేరకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మూడు మండలాల అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రుణాలకు అర్హులను ఎంపిక చేయండి



ఎంపీడీవోతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు దొరస్వామినాయుడు, పాలగిరి సిద్ధా

ములకలచెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం యువతీ, యువకుల ఉపాధి కొరకు అందజేస్తున్న స్వయం ఉపాధి రుణాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికపై ఎంపీడీవో హరినారాయణతో వారు చర్చించారు. రుణాల ఎంపికలో జాగ్రత్తలు పాటించి, అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని, అనర్హులకు రుణాలు ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, టీడీపీ నేతలు చెన్నకిష్టా, కేశవులు, జేసీబీ సుధాకర్‌నాయుడు, నాయకులు రెడ్డెప్ప, భాస్కర్‌నాయుడు, ప్రతాప్, ప్రతాప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):భారతీ జనతా పార్టీ మదనపల్లె రూరల్ అధ్యక్షుడుగా రామిరెడ్డిగారిపల్లె వెంకటరమణారెడ్డిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యల్లంపల్లె ప్రశాంత్ మాట్లాడుతూ మండలంలో బీజేపీని బలోపేతం చేయడానికి అన్ని కులాలను, వర్గాలను కలుపుకుని వెంకటరమణారెడ్డి కృషి చేస్తారన్నారు. నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన వెంకటరమణారెడ్డిని బీజేపీ నాయకులు పూలమాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భగవాన్, వసంతకుమార్, పిల్లస్వామి నాయక్, వరధారెడ్డి నారథరెడ్డి, భువ నేశ్వర్ సత్య, గంధర్వరెడ్డి, బోజ్జప్ప,కిరణ్‌కుమార్, లీగల్ అడ్వైజర్ భాగ్య జ్యోతి పాల్గొన్నారు.

రక్తదానం చేసిన 33 మంది విద్యార్థులు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): హెల్పింగ్‌మైండ్స్ సేవాసంస్థ ఆధ్వర్యంలో బి.కొత్తకోట పట్టణంలోని మధురమీనాక్షి కాలేజిలో సోమవారం నిర్వహించిన రక్తదానశిబిరంలో 33 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. సుమారు వంద మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్, కాలేజి ప్రిన్సిపాల్ రమేష్‌బాబులు మాట్లాడుతూ రక్తం కొరతతో ఏ ప్రాణం పోకూడదని, రక్తదానంపై యువతకు అవగాహన కల్పిస్తూ, పలుమార్లు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలేజి కరస్పాండెంట్ జావిద్, హెల్పింగ్‌మైండ్స్ ప్రతినిధులు ఫయాజ్, ఆరిఫ్, శీను, సుమంత్, శ్రీదేవి, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది బాలచంద్రనాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు అనుకొని విషం తాగిన మహిళ

రామసముద్రం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తున్న మహిళ నీళ్లు అనుకుని పొరపాటున పురుగు మందు కలిపిన నీళ్లు తాగి అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామస్థులు కథనం మేరకు.. మండలంలోని కాప్పల్లి పంచాయతీ పోతురాజుపల్లెకి చెందిన ఆదినారాయణ కుమార్తె రాణెమ్మ(32) పొలం వద్ద ఆదివారం వ్యవసాయ పనులు చేస్తుండగా దాహం మేసి పొరపాటున విషం కలిపిన నీళ్లను తాగి అస్వస్థతకు గురి అయింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

కురబలకోట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఇండియన్ షూటింగ్‌బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసూఫ్ పేర్కొన్నారు. సోమవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 21 ,22న జాతీయస్థాయిలో టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె25 క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలన్నారు. ఈ పోటీలకు వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన దాదాపుగా 95 టీమ్‌లు పాల్గొ న్నాయి. ఈ సందర్భంగా క్రికెట్, వ్యాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్, బాల్‌బాడ్మింటన్,పరుగుపందెం నిర్వహించారు.

నా కూతురి ఆచూకీ తెలపండి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) నా కూతురి ఆచూకి తెలపాలని తల్లి నరసమ్మ సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. ఈ నెల 16వ తేది ఆదివారం ముద్దల దేవర పండగ రోజు నుంచి తన కూతురు (19) కనబడలేదని సోమవారం పెద్దమండ్యం పోలీసులకు తల్లి నరసమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు పసుపులేటి శ్రీధర్ జ్ఞాపకార్థం సోమవారం చౌడేశ్వరి దేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు క్రీడాకారులు అన్నదానం చేశారు. బాస్కెట్‌బాల్ క్రీడాకారులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయకుడి కల్యాణోత్సవం





వినాయకస్వామి కల్యాణోత్సవం, అనంతరం అన్నదానం చేస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):స్థానిక నీరుగ ట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్ లోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆల యంలో వినాయకుడికి కల్యాణోత్సవం కన్నుల పండువగా వైభ వంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తెలుగు యువ తరాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు ఆయనను పూలమాలతో ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూ జాది కార్యక్రమాలు ఆలయకమి టీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ గౌరవాధ్యక్షుడు కాలా సోముశేఖర్, అధ్యక్షుడు సిద్దులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి రైతులు వెన్నెముక

రామసముద్రం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి రైతులు వెన్నెముకలాంటి వారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో విద్యుత్, రెవెన్యూ శాఖల సమీక్ష సందర్భంగా రైతులకు వ్యవసాయ విద్యుత్ రోజుకు తొమ్మిది గంటల సమయం ఇస్తున్నా అది మూడు విడదలుగా ఇస్తున్నారని, ఇందులో రాత్రి వేళల్లో రెండు గంటలు విద్యుత్ ఇస్తుండటం వల్ల రాత్రి వేళ పొలాల వద్ద జాగారం చేయవలసి వ స్తోందని రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రైతులకు తొమ్మిది గంటల విద్యుత్ పగటి వేళల్లో రెండు విడతలుగా ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు. అలాగే రెవెన్యూకు సంబంధించి వీఆర్వోలు గ్రామ సచివాలయాలలో అందుబాటులో ఉండడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఈ సమావేశంలో వీఆర్వోలు ఎంతమంది ఉన్నారని ఆరా తీయగా కొంతమంది గైర్హాజరైనట్లు గుర్తించి వారిపై ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి రోజు కొంత సమయం వీఆర్వోలు సచివాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నిర్మలాదేవికి సూచించారు. పశువైద్యాధికారి మండలంలో అందుబాటులో ఉండటం లేదనే ఫిర్యాదు ఉన్నాయని, దీనిని సరిదిద్దుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రామసముద్రం నుంచి పుంగనూరుకు ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

జడ్పీటీసీకి సమావేశంలో పాల్గొనే హక్కు లేదు

● టీడీపీ నేతల ధ్వజం



జడ్పీటీసీని అడ్డుకుంటామంటూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

రామసముద్రం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ జడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డికి మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనే హక్కు లేదని మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మాజీ జడ్పీటీసీ శివశంకర్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీ రామచంద్రారెడ్డి వస్తున్నారనే సమాచారం మేరకు అతనిని అడ్డుకోవాలని మండల టీడీపీ శ్రేణులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత జడ్పీటీసీ ఎన్నికలలో వైసీపీ అప్రజాస్వామిక , నియంతృత్వ పద్ధతిలో జడ్పీటీసీ అయ్యారని, అలాంటి వారు ప్రజాప్రతినిధులుగా సర్వసభ్య సమావేశంలో పాల్గొనే హక్కు లేదని స్పష్టం చేశారు. ఈనేపథ్యంలో సర్వసభ్య సమావేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సత్యనారాయణ పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అయితే జడ్పీటీసీ రామచంద్రారెడ్డి ఈసమావేశానికి హాజరు కాలేదు.

'మల్లయ్యకొండ అభివృద్ధికి కృషి చేస్తా'

కురబలకోట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం అంగళ్లు సమీపంలోని మల్లయ్యకొండను ఆయన సందర్శించి ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించి ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనతో చర్చించారు. ఆలయ అభివృద్ధికి సంబందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యుద్ధంతో దేశాభివృద్ధికి ఆటంకం : ఎమ్మెల్యే



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రాటకొండ గురుప్రసాద్, విద్యార్థులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):యుద్ధాలతో దేశాభివృద్ధికి ఆటంకమే కాకుండా ఆర్థిక ప్రగతికి ఆగిపోతుందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో రాయచోటికి చెందిన సేవ్ హెర్త్.. నో వార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ వ్యక్తిగతంగా ఉన్న విభేదాలను దేశాలపై చూపరాదన్నారు. విద్యార్థుల దశ నుంచే మంచిని గ్రహించి మంచి సమాజ స్థాపనకు రూపకర్తలు కావాలన్నారు. మదనపల్లె నుంచే గతంలో జాతీయ గీతం అనువదించడం, జాతీయ ఉద్యమాలకు నాంది పలికింది ఇక్కడేనన్నారు. శాంతి కోసం మదనపల్లె నుంచే మొదటి అడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక విద్యా సంస్థల అధినేత రాటకొండ గురుప్రసాద్, విజయభారతి సేతు, జ్ఞానోదయ కామకోటి ప్రసాద రావు, గౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, విశ్వం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, మిట్స్ కళాశాల రాజేష్, ఆదిత్యా కళాశాల అమరనాథ్‌రెడ్డి, బ్రహ్మకుమారీస్ పద్మా, పోర్టు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, ముత్తుస్కూల్ ప్రిన్సిపాల్ కవితారాణి, బీటీ కళాశాల మాజీ కరస్పాండెంట్ మునిరత్నం, రాష్ట్ర బీసీసెల్ అధికారప్రతినిధి గుత్తికొండ త్యాగరాజ, టీడీపీ నాయకులు యర్రబల్లి వెంకటరమణారెడ్డి, నవీన్‌చౌదరి, పూలకుంట్ల హరిబాబు, కత్తి లక్ష్మన్న, పురుషోత్తం, పరుపుల జయరాం, గురునాథ్,వేణుగోపాల్, ఎంఈవోలు ప్రభాకరెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎంలుపురం వెంకటరమణ, సుబ్బారెడ్డి, రాజేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీల సమస్యలను పరిష్కరిస్తాం

నిమ్మనపల్లి ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సహకారం అదించండంతో పాటు వారి సమస్యలను పరిష్కరిస్తామని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఎస్సీ ఎస్టీల సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలను పరిష్కరించేదిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఇప్పటికే ఎన్నికల హామీలలో సగం వరకు పూర్తి చేసిందని మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఎస్సీ ఎస్టీల కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా పయనిస్తామని తెలిపారు. అనంతరం ఎస్సీ, ఎస్టీల నాయకులు మాట్లాడుతూ తమకు అంబేడ్కర్ భవనం ఏర్పాటుతో పాటు టీటీడీ కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంటనే భూమిని కేటాయించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ కాయకులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఏపీఎం మురళి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, నరేంద్ర, సుధాకర్ రావు, నాయకులు పాల్గొన్నారు.

గౌతమి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



గుర్రంకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): యాసిడ్‌దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న గౌతమి కుటుంబ సభ్యులను సోమవారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఇందులో భాగంగా బెంగుళూరులో చికిత్స పొందుతున్న గౌతమి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు గౌతమి వైద్య ఖర్చులను ప్రభుత్వం అందించేందుకు అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. యాసిడ్ దాడికి పాల్పడిన నిందితుడ్ని కఠినంగా శిక్షించేలా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. అనంతరం బాధితురాలు తండ్రి జనార్ధన్‌ను ధైర్యం చెప్పి ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, హరిప్రసాద్‌నాయుడు, ఎల్లుట్ల మురళీ, హరియాదవ్, విజయ్ కుమార్, చలపతి, చలమారెడ్డి, ద్వారక, ప్రకాశ్, సుంకర శేఖర్, మహేష్, సుధాకర్, మధు, ఈశ్వర, మనోహర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను దూషిస్తున్న ఉపాధ్యాయులు మాకొద్దు

● ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన టెన్త్ విద్యార్థులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తమను అకారణంగా దూషిస్తూ, కులం పేరుతో తిడుతూ మమ్మల్ని అవమానిస్తున్న ఉపాధ్యాయులు మాకొద్దు సార్..! అంటూ హోప్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన విద్యార్థులు మాట్లాడుతూ ఆదివారం సెలవు కావడంతో తాము పాఠశాలకు వెళ్లలేదని, ప్రత్యేక తరగతులకు ఎందుకు రాలేదని, తమను ప్రీ ఫైనల్ పరీక్షలకు అనుమతించకుండా హెడ్‌మాస్టర్ విజయకుమారి, పీఈటీ దుర్భాషలాడారన్నారు. అంతే కాకుండా తమను పాఠశాల నుంచి బయటకు గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌జేడీ, డీఈవోల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె హోప్ మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం విజయకుమారికి మదనపల్లె డీవైఈవో కుమార్ సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విద్యార్థులపై కులంపేరిట దూషించడం తప్పని ఈ నోటీసులు జారీ చేశామన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం తగు చర్యలు తీసుకొంటామని ఆయన పేర్కొన్నారు.

కమ్యునిటీ స్థలాలు దురాక్రమణ కాకుండా చూడండి



కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం చుట్టూ కమ్యూనిటీ అవసరాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలు దురాక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు సోమవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలసి పునీత్ మాట్లాడుతూ మదనపల్లె చుట్టూ మూడు చోట్ల హౌసింగ్ లేఅవుట్లలో కమ్యూనిటీ అవసరాలకు కేటాయించిన స్థలాలను కొందరు కబ్జాలు చేసి, ఇంటి స్థలాలుగా మార్చి విక్రయిస్తున్నారన్నారు. కొన్నింటిలో అక్రమంగా నిర్మాణాలు కూడా చేస్తున్నారని వాటిపై విచారించి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కోరారు. ఈ కార్య క్రమంలో బీవైఎస్ నాయకులు శ్రీనివాసులు, శశికుమార్, హరి, భానుప్రకాష్, మురళి పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో చంద్రానాయక్

గుర్రంకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):రైతన్నలందరూ తప్పని సరిగా రైతు విశిష్ట గుర్తింపు కార్డును పొందాలని డీఏవో చంద్రానాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన గుర్రంకొండ రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములుండి పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డును పొందేలా సిబ్బంది పని చేయాలన్నారు. రైతు నమోదు కార్యక్రమాన్ని ఖచ్చితంగా చే యించాలన్నారు. తద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పీఎం కిసాన్ వంటి పథకా ల లబ్ధిచేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో రత్నమ్మ, ఏఈవో అనిత, సిబ్బంది నవాజ్‌ఖాన్, రైతులు పాల్గొన్నారు.

దాడి కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు చేసిన నిందితుల కేసులను ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారించాలని ఐద్వా మహిళా సంఘం నాయకురాలు భాగ్యమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఐద్వా సంఘం నాయకులు మాట్లాడుతూ గుర్రంకొండ మండలం పేరంపల్లెలో గౌతమిపై దాడి చేసిన గణేష్ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి కఠినంగా శిక్ష పడేలా చేయాలన్నారు. గౌతమి వైద్యఖర్చులు ప్రభుత్వమే భరించాలని, ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నేతలు నరసింహ, మహిళలు పాల్గొన్నారు.